RNI No. APTEL/2012/53127

TELANGANA VANI TELUGU DAILY

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

The Voice of Telangana

Published From KARIMNAGAR, HYDERABAD, ADILABAD, NIZAMABAD, WARANGAL, KHAMMAM, NALGONDA,

సంపుటి: 16 సంచిక 13 ఎడిటర్: జేరిపోతుల సంపత్, కరీంనగర్ గురువారం 16-04-2026 పేజీలు: 8, వెల : 2.00

తెలంగాణ వాణి

విలేకరులు కావలెను

తెలంగాణ వాణి దినపత్రికలో పనిచేయుటకు సిటీ బ్యూరో, జిల్లా బ్యూరోలు, నియోజకవర్గం, మండలాలవారీగా అనుభవం కలిగిన రిపోర్టర్లు కావలెను. ఆసక్తిగలవారు ఈ క్రింది నెంబరుకు సంప్రదించగలరు.

9182328292



ఇరాన్‌తో చర్చలకు అమెరికా..

## కొత్త మెలిక

### రెండు కఠిన షరతులు!

- హార్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవాలని, లేదంటే ప్రతిచర్య తప్పదని హెచ్చరిక
- ఒప్పందాలపై ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ ఆమోదం తప్పనిసరి అని స్పష్టీకరణ
- ఇరాన్ ప్రభుత్వంలో రాజకీయ, సైనిక నాయకత్వాల మధ్య విభేదాలున్నాయని కథనం

2వ పేజీలో...



2వ పేజీలో...

### మహిళాబిల్లు, పునర్విభజన చట్టం

రెంటికీ లింకుపై విపక్షాల

## ఆందోళన

### పార్లమెంట్‌లో జరిగే చర్చతో తేలనున్న విషయం

న్యూఢిల్లీ,ఏప్రిల్ 15: చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడానికి, నియోజకవర్గాల పునర్విభజనకు లింకు పెట్టడం ఎందుకని ప్రభుత్వాన్ని విపక్ష రాజకీయ పార్టీలు నిలదీస్తు న్నాయి. ఇందులో కుట్ర కోణం దాగివుందని అంటున్నాయి. నేటినుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల నేపథ్యంలో ఇప్పటికే దీనిపై అనేక కోణాల్లో విమర్శలు వస్తున్నాయి. దక్షిణాదికి అన్యాయం జరగబోతోందని తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, తమిళనాడు సిఎం స్టాలిన్ తదితరులు ఆరోపిస్తున్నారు. ఈ రెంటిని కలపడంపైనా మండిపడు తున్నారు. అలాగే ఇదే విషయమై సామాజిక ఉద్యమకారులు ప్రశ్నించారు. కేంద్రం ఎంపీలకు పంపిణీ చేసిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై వివిధ పక్షాలకు చెందిన నాయకులు పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ బిల్లులో మొత్తం లోక్‌సభ స్థానాలను గరిష్ఠంగా 850కి పెంచాలని ప్రతిపాదించినప్పటికీ వాటిని రాష్ట్రాల వారీగా ఏ ప్రాతిపాదికన అమలు చేస్తారన్న దానిపై స్పష్టత ఇవ్వకపోవడాన్ని ప్రతిపక్షాలు తప్పబడుతున్నాయి.



తెలంగాణలో భగ్గుమంటున్న..

## సూరీడు

### పలు జిల్లాల్లో 43 డిగ్రీలు దాటిన ఎండలు

- తెలంగాణలో ఉగ్రరూపం దాల్చిన ఎండలు.. రానున్న 5 రోజులు కీలకం
- నల్గొండ జిల్లాలో అత్యధికంగా 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- పలు జిల్లాల్లో 42 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రతలు
- రానున్న ఐదు రోజుల్లో 45 డిగ్రీలు దాటే అవకాశం
- వాతావరణ శాఖ నుంచి ప్రజలకు హెచ్చరిక

2వ పేజీలో...



## బీహార్‌లో కొత్త శకం

### తొలి బీజేపీ సీఎంగా సామ్రాట్ చౌదరి ప్రమాణం

- బీహార్ నూతన ముఖ్యమంత్రిగా సామ్రాట్ చౌదరి ప్రమాణ స్వీకారం
- రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు
- డిప్యూటీ సీఎంలుగా విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర ప్రసాద్ యాదవ్
- రాజ్యసభకు వెళ్లిన నితీశ్ కుమార్.. నాయకత్వ మార్పునకు మార్గం సుగమం

పాట్నా: బీహార్ రాజకీయాల్లో ఒక చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్ర చరిత్రలోనే తొలి సారిగా బీజేపీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడింది. బీహార్ 24వ ముఖ్యమంత్రిగా బీజేపీ సీనియర్ నేత సామ్రాట్ చౌదరి ప్రమాణ స్వీకారం చేశారు. పాట్నాలోని లోక్ భవన్‌లో జరిగిన కార్యక్రమం లో గవర్నర్ సయ్యద్ అతా హస్నైన్ ఆయనతో పదవీ ప్రమాణం చేయించారు. సామ్రాట్ చౌదరితో పాటు జేడీయూ సీనియర్ నేతలు విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర ప్రసాద్ యాదవ్ ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. మాజీ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లడంతో ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. దీంతో రాష్ట్రంలో బీజేపీ ప్రత్యక్ష నాయకత్వానికి మార్గం సుగమమైంది. ప్రమాణ స్వీకారానికి ముందు సామ్రాట్ చౌదరి రాజ్‌వంశీ నగర్‌లోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

2వ పేజీలో...



అండమాన్ సముద్రంలో..

## పడవ మునిగి 250 మంది గల్లంతు

- ప్రమాదానికి సంబంధించి ఐక్యరాజ్య సమితి ప్రకటన
- బంగ్లాదేశ్ నుంచి మలేషియాకు వెళ్తోన్న పడవ
- బలమైన గాలులు, కెరటాల ఉద్ధృతి కారణంగా ప్రమాదం

అండమాన్: రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరులతో వెళ్తోన్న ఓ పడవ అండమాన్ సముద్రంలో మునిగిపోయింది. ఈ ఘోర ప్రమాదంలో చిన్నారులు సహా దాదాపు 250 మంది గల్లంతయ్యారు. వారి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదానికి సంబంధించి ఐక్యరాజ్య సమితి శరణార్థుల హైకమిషనర్, ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ సంయుక్త ప్రకటన విడుదల చేసింది. "దక్షిణ బంగ్లాదేశ్‌లోని టెక్నాఫ్ నుండి బయలుదేరి మలేషియాకు వెళ్తున్న ట్రాలర్, బలమైన గాలులు, కెరటాల ఉద్ధృతి, పరిమితికి మించిన జనంతో ప్రయాణించడం వంటి కారణాలతో మునిగిపోయినట్లు తెలుస్తోంది" అని



2వ పేజీలో...

మహిళా రిజర్వేషన్ బిల్లుకు

## కేసీఆర్ పూర్తి మద్దతు

### డీలిమిటేషన్‌పై వార్నింగ్

- పార్టీ ముఖ్య నేతలతో మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్‌పై కేసీఆర్ చర్చ
- మహిళా రిజర్వేషన్లకు అనుకూలంగా గతంలోనే తీర్మానం చేశామన్న కేసీఆర్
- డీలిమిటేషన్ కారణంగా దక్షిణాదికి ఇప్పుడున్న 24 శాతం సీట్లు తగ్గకూడదని వార్నింగ్

హైదరాబాద్: మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తన గళాన్ని వినిపించారు. ఎర్రవెల్లిలోని ఫామ్ హౌస్ లో పార్టీ ముఖ్యనేతలు కేటీఆర్, హరీశ్ రావులతో నిర్వహించిన భేటీలో..



ఆమె పిల్లలు కేంద్రం వద్ద

## పని చేస్తున్నారు

న్యాయమూర్తి వైదొలగాలని కేజ్రీవాల్ మరో పిటిషన్

2వ పేజీలో...



2వ పేజీలో...

డీలిమిటేషన్ కేవలం

రాజకీయ సవరణగా

## మిగలొద్దు

దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గితే ప్రజా ఉద్యమం తప్పదు

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక

హైదరాబాద్, ఏప్రిల్ 15 : నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాదికి ప్రాతినిధ్యం తగ్గేలా డీలిమిటేషన్ జరిగితే అది కేవలం ఒక రాజకీయ పక్రియగానో లేక చట్ట సవరణ గానో మిగిలిపోదని అన్నారు. మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక బలమైన ప్రజా ఉద్యమానికి దారితీస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని తేల్చి చెప్పారు. మూడేళ్ల క్రితం తాము తీసుకున్న దృఢమైన నిర్ణయా నికే కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు. తామంతా గర్వించదగ్గ భారతీయులమని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అత్యుత్తమ రాష్ట్రాల ప్రతినిధులమని కేటీఆర్ పేర్కొన్నారు. జనాభా నియంత్రణతో పాటు వివిధ రంగాల్లో అద్భుత ప్రగతి సాధిస్తున్న దక్షిణ రాష్ట్రాలకు, ఈ పునర్విభజన వల్ల రాజకీయంగా అన్యాయం జరగడం సమంజసం కాదని ఆయన అభిప్రా యపడ్డారు. అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, వాటి ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని ఆయన విమర్శించారు.

పిల్లల నుంచే ట్రాఫిక్ నిబంధనలపై..

## అవగాహన ఉండాలి

### రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

ఆదిలాబాద్, ఏప్రిల్ 15, ( తెలంగాణ వాణి ప్రతినిధి ) : రహదారి నిబంధనలపై అవగాహన అనేది చిన్ననాటి నుంచే అలవడాలని, అప్పుడే భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదుగుతారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని చావర పాఠశాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన 'చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్'ను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభించి, విద్యార్థులతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 'మొక్కై వంగనిది మానై వంగునా' అన్న సామెతను గుర్తు చేస్తూ, చిన్న వయసులోనే ట్రాఫిక్ నియమాలపై అవగాహన లేకపోతే భవిష్యత్తులో ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. ఈ పార్క్ ద్వారా విద్యార్థులు ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్డు గుర్తులపై ప్రత్యక్షంగా అవగాహన పెంచుకోవచ్చని తెలిపారు.



# పిల్లల నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ఉండాలి



జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి విద్యార్థులు ఇక్కడికి వచ్చి అవగాహన పొందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రహదారి భద్రతలో నాలుగు అంశాలు ఎడ్యుకేషన్, ఇంజనీరింగ్, ఎన్ఫోర్స్మెంట్, ఎమర్జెన్సీ కీలకమని మంత్రి వివరించారు. గతంలో ప్రమాదం జరిగితే సాక్ష్యంగా ఉండాల్సి వస్తుందనే భయంతో ఎవరూ ముందుకు వచ్చేవారు కాదని, కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రహవీర్' అవార్డు ద్వారా ప్రాణాలు కాపాడిన వారికి 25 వేల నగదు బహుమతితో పాటు సత్కారం అందిస్తున్నట్లు గుర్తుచేశారు. హెల్మెట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకపోవడం, రాంగ్ రూట్‌లో వెళ్లకపోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని కోరారు. భవిష్యత్తులో పాఠశాల పాఠ్యాంశాల్లో కూడా రహదారి భద్రతను ఒక అంశంగా చేర్చే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని మంత్రి వెల్లడించారు. స్థానిక శాసన సభ్యులు పాయల్ శంకర్ మాట్లాడుతూ, రహదారి నిబంధనల పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. నిత్యం జరుగుతున్న రోడ్డు ప్రమాదాల వల్ల ఎంతో మంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. సాంకేతికతతో మనిషి దేనినైనా తిరిగి పొందగలడు కానీ, ప్రాణాన్ని మాత్రం తిరిగి తీసుకురాలేమని, కాబట్టి ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు ట్రాఫిక్ రూల్స్‌ను తూచా తప్పకుండా పాటించాలని కోరారు. కేవలం పోలీసుల జరిమానాలకే భయపడకుండా, తమ ప్రాణ రక్షణ కోసం నిబంధనలు పాటించాలనే ఆలోచన ప్రజల్లో కలగాలని ఆయన ఆకాంక్షించారు. రహదారి భద్రతపై అవగాహన కేవలం పట్టణాలకే పరిమితం కాకుండా, ప్రతి గ్రామంలోని పాఠశాలలు, పంచాయతీల వరకు విస్తరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. జాతీయ రహదారులపై మితిమీరిన వేగంతో ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని,

**మొదటిపేజీ తరువాయి...**

ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన తెలిపారు. ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ, రహదారి నిబంధనలు కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించి అమూల్యమైన ప్రాణాలను రక్షించుకోవచ్చని అన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనాలు నడపాలని, ముఖ్యంగా యువత ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. చిన్న ప్రయాణమైనా హెల్మెట్ ధరించడం అలవాటు చేసుకోవాలని, తల్లిదండ్రులు తమ పిల్లల్లో ఈ అలవాటు పెంపొందించాలని కోరారు. ట్రాఫిక్ సిగ్నల్స్‌ను గౌరవించడం, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ వంటి పత్రాలను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవడం అవసరమని తెలిపారు. ఉట్నూర్ ఏజెన్సీ ప్రాంతానికి కేంద్రంగా ఉన్నందున ఇక్కడ ఆర్‌టీఓ యూనిట్ కార్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఉట్నూర్ బస్టాండ్ పరిసరాల్లో ఖాళీ స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. ఉట్నూర్ నుండి ఆదిలాబాద్‌కు ఉదయం వేళల్లో ఉద్యోగాలు, విద్య కోసం వెళ్లే ప్రజల సౌకర్యార్థం కనీసం రెండు నాన్‌స్టాప్ మినీ బస్సులను ప్రవేశపెట్టాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూషా మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా సెల్‌ఫోన్ వినియోగం, మద్యం సేవించి డ్రైవింగ్, అతివేగం ప్రమాదకరమని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని కోరారు. ప్రజలు బాధ్యతాయుతంగా వాహనాలు నడిపి ప్రమాద రహిత సమాజం నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. రవాణా శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ వికాస్ రాజ్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను నివారించడం, ప్రాణనష్టాన్ని తగ్గించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన 'ఎరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. చిన్నతనం నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించేందుకు ప్రతి పాఠశాలలో ట్రాఫిక్ అవేర్నెస్ పార్క్ ఉండాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులతో పాటు వెనుక కూర్చునే వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. రోడ్డు ప్రమాదానికి గురైన వారికి 1.5 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని, దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 ఆసుపత్రులను గుర్తించడం జరిగిందని తెలిపారు.

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తూచా తప్పకుండా పాటించి ప్రమాద రహిత సమాజ స్థాపనకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఆర్ టి సి ఎండి నాగిరెడ్డి మాట్లాడుతూ, గత ఏడాది జిల్లాలో 117 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందగా, ఎక్కువ మంది ద్విచక్ర వాహనదారులేనని తెలిపారు. హెల్మెట్ వినియోగం తప్పనిసరి అని సూచించారు. తెలంగాణ ఆర్టీసీ సేవలను ప్రశంసిస్తూ, డ్రైవర్లకు మెరుగైన శిక్షణ కోసం సిమ్యులేటర్లు అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు.

జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపే ప్రాణరక్షకు మార్గం అని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో ప్రజల అవగాహన అత్యంత కీలకమని తెలిపారు. విద్యార్థులకు చిన్న వయసు నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు 'ఖాకీ కిడ్స్' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. జిల్లాలో గత వారం రోజుల్లో 14 నుంచి 17 సంవత్సరాల మధ్య వయస్సు గల సుమారు 400 మంది మైనర్లు వాహనాలు నడుపుతూ గుర్తించబడినట్లు తెలిపారు. వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని హెచ్చరించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కఠినతరం చేయడంతో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు తగ్గుముఖం పట్టినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల కుటుంబాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని, అందువల్ల ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించి బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రోడ్డు భద్రత నియమాలపై అవగాహనా కల్పించిన విద్యార్థులను మంత్రి అభినందించి, మెడల్ లను అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ మల్లెపూల నర్సయ్య, జిల్లా ఇంచార్జి కలెక్టర్ యువరాజు మర్మాట్, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ పి. రవీందర్ కుమార్, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీనివాస్, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కె. హరీంద్ర కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో భగ్గుమంటున్న సూరీడు

**మొదటిపేజీ తరువాయి...**



హైదరాబాద్,:తెలంగాణలో భానుడు ఉగ్రరూపం ప్రదర్శిస్తున్నాడు. రాష్ట్రవ్యాప్తంగా ఎండలు మండిపోతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు. ఏప్రిల్ మధ్యలోనే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం నల్గొండ జిల్లా అడవి దేవులపల్లి మండలంలో అత్యధికంగా 43.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. జగిత్యాల జిల్లా కోరుట్లలో 43.4 డిగ్రీలు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో 43.3 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఆదిలాబాద్‌లో 43.2 డిగ్రీలు నమోదు కాగా, సిద్దిపేట, కామారెడ్డి, కరీంనగర్, మంచిర్యాల, సిరిసిల్ల, సంగారెడ్డి జిల్లాల్లో కూడా పగటి ఉష్ణోగ్రతలు 42.8 డిగ్రీలకు పైగా ఉన్నాయి. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత ప్రారంభమై మధ్యాహ్నానికి గరిష్ఠ స్థాయికి చేరుకుంటోంది. తీవ్రమైన ఎండలకు తోడు ఉక్కపోత కూడా అధికంగా ఉండటంతో జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ కీలక హెచ్చరిక జారీ చేసింది. రానున్న ఐదు రోజుల పాటు ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని, ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల మార్కును కూడా దాటవచ్చని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

# ఇరాన్‌తో చర్చలకు అమెరికా కొత్త మెలిక

**మొదటిపేజీ తరువాయి...**

వాషింగ్టన్: అంతర్జాతీయంగా తీవ్ర ఉత్కంఠ రేపుతున్న అమెరికా-ఇరాన్ వివాదంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌తో చర్చలు పునఃప్రారంభించాలంటే రెండు కఠినమైన షరతులను పాటించాల్సిందేనని అమెరికా స్పష్టం చేసింది. పాకిస్థాన్‌లో జరగబోయే తదుపరి విడత చర్చలకు ముందే ఈ నిబంధనలను తెరపైకి తెచ్చింది. ఇరు దేశాల మధ్య శాంతి చర్చలు రెండు రోజుల్లో పునఃప్రారంభమయ్యే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచనప్రాయంగా తెలిపినప్పటికీ, ఈ కొత్త షరతులు సందిగ్ధతకు దారితీస్తున్నాయి. దౌత్యపరమైన వర్గాలను ఉటంకిస్తూ ఇజ్రాయెల్ హయోమ్ పత్రిక వెల్లడించిన వివరాల ప్రకారం అమెరికా పెట్టిన మొదటి షరతు.. హర్మూజ్ జలసంధిని ఎలాంటి ఆంక్షలు లేకుండా పూర్తిగా తెరవడం. ఇరాన్ గనుక తమ నౌకలు, ట్యాంకర్ల రాకపోకలను అడ్డుకుంటే, తాము కూడా ఇరాన్ నౌకలను కదలనివ్వబోమని అమెరికా స్పష్టం చేసింది. ప్రతిచర్య తప్పదనే సంకేతాలను బలంగా పంపింది.

ఇక రెండో షరతుగా.. చర్చలకు వచ్చే ఇరాన్ ప్రతినిధి బృందానికి ఒప్పందాలను ఖరారు చేసే పూర్తి అధికారం ఉండాలని అమెరికా పట్టుబడుతోంది. ముఖ్యంగా ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) సహా ప్రభుత్వంలోని అన్ని కీలక విభాగాల ఆమోదం పొందే అధికారం ఆ బృందానికి ఉండాలని స్పష్టం చేసింది. ఇస్లామాబాద్‌లో కుదిరే ఏ ఒప్పందానికైనా ప్రభుత్వంలోని ఉన్నతాధికారులందరి సమ్మతి ఉండాలని కోరుకుంటోంది.

ఇరాన్ ప్రభుత్వంలో అంతర్గత విభేదాలు: అమెరికా ఈ షరతులు పెట్టడం వెనుక బలమైన కారణం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఇరాన్ ప్రభుత్వంలో అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, విదేశాంగ




మంత్రి అబ్బాస్ అరాఘ్చి వంటి రాజకీయ నాయకత్వానికి, ఐఆర్‌జీసీకి మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరినట్లు కథనాలు వస్తున్నాయి. ఇటీవల పాకిస్థాన్‌లో జరిగిన చర్చల్లో అమెరికాకు సమాధానాలు ఇవ్వకుండా రాజకీయ ప్రతినిధి బృందాన్ని ఐఆర్‌జీసీకి చెందిన ఇద్దరు సీనియర్ అధికారులు అడ్డుకున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో దేశాన్ని పూర్తి ఆర్థిక పతనం నుంచి కాపాడాలని అధ్యక్షుడు పెజెష్కియాన్ పార్లమెంట్ స్పీకర్‌ను కోరినట్లు వార్తలు వచ్చాయి. ఈ అంతర్గత గందరగోళం కారణంగానే ఒప్పందం చేసుకునే పూర్తి అధికారంతో వస్తేనే చర్చలుంటాయని అమెరికా స్పష్టం చేసింది. గత వారాంతంలో పాకిస్థాన్‌లో ఇరు దేశాల మధ్య జరిగిన తొలి విడత చర్చలు ఎలాంటి పురోగతి లేకుండానే ముగిశాయి. దశాబ్దం తర్వాత అమెరికా, ఇరాన్ అధికారులు నేరుగా చర్చలు జరపడం ఇదే తొలిసారి. ఇప్పుడు పాకిస్థాన్ చొరవతో ఈ వారంలోనే రెండో విడత చర్చలు జరిగే అవకాశం ఉందని రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. అయితే, అమెరికా అధికారులు దీనిపై ఇంకా అధికారికంగా స్పందించలేదు.

# బీహార్‌లో కొత్త శకం..

**మొదటిపేజీ తరువాయి...**

తలపాగా శపథం నెరవేర్చుకున్న సామ్రాట్: 1990లో క్రియాశీల రాజకీయాల్లోకి ప్రవేశించిన సామ్రాట్ చౌదరి, 1999లోనే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేశారు. 2018 నుంచి బీజేపీలో కీలక నేతగా ఎదుగుతూ వచ్చారు. నితీశ్ కుమార్ బీజేపీతో తెగదెంపులు చేసుకుని మహాఘటబంధన్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పుడు, శాసనమండలిలో ప్రతిపక్ష నేతగా ఉన్న సామ్రాట్ చౌదరి ఒక శపథం చేశారు. నితీశ్‌ను సీఎం పదవి నుంచి దించేంత వరకు తన తలపాగా (మురైఠా) తీయనని ప్రతిజ్ఞ చేశారు. ఈ పంతం ఆయన రాజకీయ జీవితంలో ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. ఇప్పుడు సీఎంగా బాధ్యతలు చేపట్టి తన శపథాన్ని నెరవేర్చుకున్నారు.

అనుభవజ్ఞులైన డిప్యూటీ సీఎంలు: నూతన ప్రభుత్వంలో ఉప ముఖ్య మంత్రులుగా బాధ్యతలు చేపట్టిన విజయ్ కుమార్ చౌదరి, విజేంద్ర ప్రసాద్ యాదవ్ ఇద్దరూ నితీశ్ కుమార్‌కు అత్యంత నమ్మకస్తులు, పరిపాలనలో అనుభవజ్ఞులు. విజయ్ కుమార్ చౌదరి గతంలో పలు కీలక శాఖలు నిర్వహించారు. ఇక, 79 ఏళ్ల విజేంద్ర ప్రసాద్ యాదవ్‌ను 'కోసీ ప్రాంత రాజకీయ చాణక్యుడు'గా పిలుస్తారు. 1990 నుంచి వరుసగా ఎన్నికల్లో గెలుస్తూ వస్తున్న ఆయన, ముఖ్యంగా విద్యుత్ రంగంలో చేసిన అభివృద్ధితో ప్రజల్లో మంచి పేరు సంపాదించారు. సామ్రాట్ చౌదరి నాయకత్వంలో ఈ అనుభవజ్ఞులైన నేతలతో కూడిన కొత్త ప్రభుత్వం, రాష్ట్ర అభివృద్ధిని కొనసాగిస్తూ ప్రజల ఆకాంక్షలను ఎలా నెరవేరుస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# 'ఆమె పిల్లలు కేంద్రం వద్ద పని చేస్తున్నారు'



**మొదటిపేజీ తరువాయి...**

న్యూఢిల్లీ: ఆప్ అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ బుధవారం ఢిల్లీ హైకోర్టులో అదనపు అఫిడవిట్ దాఖలు చేశారు. తాను నిందితుడిగా ఉన్న ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసు విచారణ నుంచి జస్టిస్ స్వర్ణ కాంత శర్మను తప్పించాలని మరోసారి కోరారు. అదే కేసులో కేంద్రం తరఫున వాదిస్తున్న సొలిసిటర్ జనరల్ కింద ఆ న్యాయమూర్తి కుమారుడు పని చేస్తున్నట్లు కేజ్రీవాల్ ఆరోపించారు. ఇది రాజకీయంగా సున్నితమైన కేసు అని తెలిపారు. దీంతో జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ముందు జరిగే విచారణ నిష్పక్షపాతంగా లేదా తటస్థంగా ఉండదనే తీవ్రమైన, స్పష్టమైన, సహేతుకమైన అనుమానం తనకు ఉన్నదని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సీబీఐ పిటిషన్‌పై విచారణ నుంచి ఆ న్యాయమూర్తిని తప్పించాలని కేజ్రీవాల్ కోరారు. కాగా, ట్రయల్ కోర్టు కొట్టేసిన ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసును జస్టిస్ శర్మ విచారించడంపై కేజ్రీవాల్ అదనపు అభ్యంతరాలు లేవనెత్తారు. తన అరెస్టును సవాల్ చేస్తూ గతంలో తాను దాఖలు చేసిన పిటిషన్‌పై తనకు ఉపశమనాన్ని ఆమె నిరాకరించారని, మనీష్ సిసోడియా సహా ఇతర నిందితుల బెయిల్ పిటిషన్లను తిరస్కరించారని పేర్కొన్నారు. అలాగే ఆ న్యాయమూర్తి 'బలమైన, నిశ్చయాత్మకమైన' వ్యాఖ్యలు చేశారని ఆయన పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుబంధంగా ఉన్న న్యాయవాదుల సంస్థ అయిన అధివక్త పరిషత్ నిర్వహించిన కార్యక్రమాలకు న్యాయమూర్తి స్వర్ణ కాంత శర్మ పలుమార్లు హాజరయ్యారని కూడా ఆయన ఆరోపించారు.

మరోవైపు ఢిల్లీ లిక్కర్ కేసు విచారణ నుంచి న్యాయమూర్తి స్వర్ణ కాంత శర్మ తప్పుకోవాలన్న అభ్యర్థనను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వ్యతిరేకించారు. కేజ్రీవాల్, ఇతరులపై కోర్టు ధిక్కరణ చర్యలు ప్రారంభించాలని ఆయన కోర్టును కోరారు. కేజ్రీవాల్ లేవనెత్తిన ఆందోళనలు 'అపరిపక్వ మనసు, అపరిపక్వ భయాలు'గా అభివర్ణించారు. ఈ విషయం 'సంస్థాగత గౌరవానికి' సంబంధించినదని తెలిపారు. జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ఎలాంటి ఒత్తిడికి లొంగకూడదని మెహతా వాదించారు. నిరాధారమైన ఆరోపణలపై కేసు నుంచి తప్పుకోవడం ఒక చెడు సంప్రదాయానికి దారితీస్తుందని ఆయన అన్నారు.

అయితే ఢిల్లీ లిక్కర్ పాలసీపై సీబీఐ కేసు న్యాయ సమీక్షకు నిలబడలేదని ఫిబ్రవరి 27న ట్రయల్ కోర్టు పేర్కొంది. కేజ్రీవాల్, సిసోడియా, మరో 21 మందిని నిర్దోషులుగా విడుదల చేసింది. ఈ తీర్పును ఢిల్లీ హైకోర్టులో సీబీఐ సవాల్ చేసింది. ట్రయల్ కోర్టులోని కొన్ని నిర్ధారణలు ప్రాథమికంగా తప్పుగా ఉన్నాయని గమనించినట్లు జస్టిస్ స్వరణ కాంత శర్మ పేర్కొన్నారు. సీబీఐ దర్యాప్తు అధికారిపై శాఖాపరమైన చర్య తీసుకోవాలన్న విచారణ కోర్టు సిఫార్సుపై కూడా ఆమె స్టే విధించారు. మార్చి 9న లిక్కర్ పాలసీ కేసు నిందితులకు నోటీసులు జారీ చేశారు.

అలాగే సీబీఐ పిటిషన్ విచారణ నుంచి తనను తప్పించాలని కోరుతూ కేజ్రీవాల్, ఇతర నిందితులు దాఖలు చేసిన పిటిషన్లపై తీర్పును జస్టిస్ స్వర్ణ కాంత శర్మ ఏప్రిల్ 13న రిజర్వ్ చేశారు. అంతకు ముందు ఈ కేసును బదిలీ చేయాలన్న కేజ్రీవాల్ అభ్యర్థనను ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీకే ఉపాధ్యాయ తిరస్కరించారు. కేసు విచారణ నుంచి వైదొలగాలా వద్దా అన్నది సంబంధిత న్యాయమూర్తి నిర్ణయించాలని పేర్కొన్నారు.

## డీలిమిటేషన్ కేవలం రాజకీయ సవరణగా మిగలొద్దు

**మొదటిపేజీ తరువాయి...**

దేశంలోని అత్యున్నత ప్రజాస్వామ్య వేదిక అయిన పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని, ప్రతినిధిత్వాన్ని అణచివేయాలని చూస్తే తాము నిశ్శబ్దంగా చూస్తూ ఉండబోమని స్పష్టం చేశారు. దక్షిణ భారతీయుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తామని కేటీఆర్ ప్రకటించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని అన్నారు. 'ఢిల్లీ పాలకులు మా మాట వినాలని, బుద్ధి ప్రబలాలని ఆశిస్తున్నాం' అంటూ సోషల్ మీడియా ఎక్స్‌లో కేటీఆర్ పోస్ట్ చేశారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేసీఆర్ పూర్తి మద్దతు..

**మొదటిపేజీ తరువాయి...**

జాతీయ రాజకీయ పరిణామాలు, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలపై ఆయన సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ... చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందని ప్రకటించారు. గతంలోనే తాము అసెంబ్లీలో దీనికి అనుకూలంగా తీర్మానం చేశామని గుర్తు చేస్తూ, రాజ్యసభలో తమ ఎంపీలు ఈ బిల్లుకు మద్దతు తెలుపుతారని స్పష్టం చేశారు. ఇదే సమయంలో... నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయంపై కేసీఆర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం ఎంపీ సీట్లు ఉన్నాయని... జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల సీట్ల శాతం (ప్రస్తుతం ఉన్న 24 శాతం) తగ్గకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఒకవేళ దక్షిణాది ప్రయోజనాలకు విఘాతం కలిగితే రాజీలేని పోరాటం చేస్తామని కేంద్రానికి హెచ్చరికలు జారీ చేశారు. ఈ నెల 20న జగిత్యాలలో జరగనున్న భారీ బహిరంగ సభ, అలాగే ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని కేటీఆర్, హరీశ్ రావులను ఆదేశించారు.

# మహిళాబిల్లు, పునర్విభజన చట్టం

**మొదటిపేజీ తరువాయి...**

కేంద్ర ప్రభుత్వం అనధికారికంగా చెప్పినట్లు ఇప్పుడున్న సీట్లను 50శాతం పెంచితే అన్ని రాష్ట్రాల్లోనూ ఆ వాటా ప్రకారం పెరుగుతాయి. అలాకాకుండా ప్రస్తుతం అందుబాటులో ఉన్న తాజా జనాభా లెక్కల ప్రకారం... అంటే 2011 జనాభా లెక్కలను ఆధారంగా చేసుకుని నియోజకవర్గాలను పునర్విభజిస్తే కుటుంబ నియంత్రణ అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంటుందని వాదిస్తున్నారు. ఇది ఆందోళనకరంగా కనిపిస్తోందని దక్షిణాది రాష్ట్రాల ఎంపీలు పలువురు పేర్కొంటున్నారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలంటే నియోజవర్గాల పునర్విభజన చేయకతప్పదన్న అభిప్రాయాన్ని తప్పుపట్టారు. లోక్‌సభ, అసెంబ్లీల్లో ప్రస్తుతం ఉన్న స్థానాల సంఖ్యకు అనుగుణంగానే మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండు చేశారు. ఈ అంశంపై విస్తృతంగా చర్చలు జరపాలని ప్రతి ఒక్కరూ కోరుతున్నారు. ఇందుకు సంబంధించిన బిల్లు ముసాయిదా ప్రతులను ఇంతవరకు ఎంపీలకు ఇవ్వకపోవడాన్ని, ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడాన్ని ప్రశ్నించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలంటే లోక్‌సభలో ప్రస్తుతం ఉన్న సీట్లను 543 నుంచి 850 వరకు పెంచాల్సిన అవసరం ఏముందని నిలదీస్తున్నారు. లోక్‌సభ సీట్లను 850కి పెంచితే అది ప్రపంచంలోనే అతి భారీ చట్ట సభ అవుతుందని అన్నారు. అది సభాకార్యకలాపాల నిర్వహణపై ప్రభావం చూపుతుందని తెలిపారు. గతంలో సభ ఏడాదిలో 150 రోజుల పాటు సభ జరిగేదని ఇప్పుడు 55 రోజులపాటు కూడా జరగడం లేదని గుర్తు చేశారు. రిజర్వేషన్లలో ఓబీసీలకు ఉప కోటా లేకపోవడాన్ని కొందరు ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్లలో కూడా రిజర్వేషన్ల గురించి అప్పుడే చర్చ మొదలయ్యింది. మొత్తంగా ఈ విషయంలో పార్లమెంటులో చర్చ జరిగితే తప్ప సరైన సమాధానం రాదు. అయితే 2011 జనాభా లెక్కల ప్రకారం అయితే పునర్విభజన పక్కన పెట్టాలని అంటున్నారు.

# సంపాదకీయం

## పొంచి ఉన్న ఆయిల్ సంక్షోభం..

అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు విఫలమయ్యాయి. 21 గంటలపాటు జరిగిన చర్చల్లో ఇరుదేశాల మధ్య ఎలాంటి ఒప్పందం కుదరలేదు. దీంతో రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారి తీస్తుందోనన్న ఆందోళనలు నెలకొన్నాయి. పశ్చిమాసియాలో మరోసారి యుద్ధ జ్వాలలు తప్పవా..! ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం తప్పదా..! నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయా..! అమెరికా–ఇరాన్ మధ్య చర్చల విఫలం ఎలాంటి పరిణామాలకు దారి తీయనుంది..అమెరికా–ఇరాన్ మధ్య చర్చలు విఫలమైన నేపథ్యంలో ప్రస్తుతం కుదిరిన రెండు వారాల తాత్కాలిక విరమణ ఒప్పందం ముగిసిపోయే అవకాశాలు కన్పిస్తున్నాయి. దీంతో ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడే అవకాశం ఉంది. ఇరాన్‌లోని చమురు కేంద్రాలతో పాటు.. పౌర మౌలిక సదుపాయాలపైనా దాడులకు అవకాశం ఉంది. ఒప్పందం కుదరకపోతే భీకర దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు చేశారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆయన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే దానిపై భయాందోళనలు నెలకొన్నాయి.అమెరికా– ఇరాన్ దాడులకు ఇరాన్ కూడా అంతే గట్టిగా ప్రతిఘటిస్తుంది. ఇజ్రాయెల్‌తో పాటు పశ్చిమాసియాలోని చమురు క్షేత్రాలను లక్ష్యంగా చేసుకోవచ్చు. అదే జరిగితే.. సౌదీ, యూఏఈ, బహ్రెయిన్, కువైట్ తదితర దేశాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇరాన్ దాడుల్లో పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలకు కూడా ముప్పు పొంచి ఉంది. ఈ యుద్ధం లెబనాన్, సిరియాలకు కూడా విస్తరించే అవకాశం లేకపోలేదు. టెహ్రాన్‌కు మద్దతుగా హూతీలు, హెజ్‌బొల్లాలు తమ కార్యకలాపాలను తీవ్రతరం చేస్తాయి.హర్మూజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టుబిగిస్తుంది. దీన్ని శాశ్వతంగా మూసివేస్తుంది. దీంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొనే ప్రమాదం ఉంది. పెట్రోల్, డీజిల్ ధరలు ఊహించని స్థాయికి చేరుకోవచ్చు. అనేక దేశాల్లో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటే ప్రమాదం ఉంది. ఈ పరిణామాలు ఆర్థిక మాంద్యానికి కారణం కావొచ్చు.ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని మరింత వేగవంతం చేయొచ్చు. ఇప్పటివరకు పౌర అవసరాల కోసం మాత్రమే యురేనియంను శుద్ధి చేస్తున్నట్లు ఆ దేశం చెప్పుకొచ్చింది. ఈ ఉత్కంఠభరిత పరిస్థితుల మధ్య, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో షేర్ చేసిన ఒక వార్తా కథనం ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై పెను చర్చకు దారితీసింది. తమ నిబంధనలకు టెహ్రాన్ లొంగని పక్షంలో, ఇరాన్ నౌకలను సముద్ర మార్గంలోనే అడ్డుకునే 'నౌకాదళ దిగ్బంధనం' అస్త్రాన్ని ప్రయోగించే అవకాశం ఉందని ఆ కథనం పేర్కొందిఒకవేళ ఈ ప్లాన్ అమలైతే, ఇరాన్ నౌకలు రేవుల నుంచి ముందుకు వెళ్ళలేవు. దీనివల్ల ఆ దేశానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న చమురు ఎగుమతులు పూర్తిగా ఆగిపోయి, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉంది. కేవలం ఇరాన్‌కే కాకుండా, ఆ దేశం నుండి పెద్ద ఎత్తున చమురును కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై కూడా దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది.గతంలో వెనిజులా మాజీ అధ్యక్షుడు మదురోను లొంగదీసుకోవడానికి అమెరికా ఇదే విధమైన నౌకాదళ దిగ్బంధనాన్ని అమలు చేసి విజయం సాధించింది. అదే తరహా వ్యూహాన్ని ఇప్పుడు ఇరాన్‌పై కూడా ట్రంప్ అమలు చేసే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియా అంచనా వేస్తోంది. పాకిస్థాన్ వేదికగా ఇరాన్‌తో జరిగిన చర్చలు విఫలమైనట్లు అధికారికంగా ప్రకటించిన కొద్ది గంటల్లోనే ట్రంప్ ఈ పోస్ట్ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది కేవలం మీడియా కథనం మాత్రమేనా లేక అమెరికా తదుపరి కార్యాచరణకు ఇది పరోక్ష సంకేతమా అని విశ్లేషకులు భావిస్తున్నారు. ట్రంప్ తన పోస్ట్ ద్వారా ఇరాన్‌కు స్పష్టమైన హెచ్చరికలు పంపినట్లు తెలుస్తోంది.తాజా పరిణామాలతో అణుబాంబు తయారీ దిశగా అది అడుగులు వేయొచ్చు. ఆరోపణలపై ట్రంప్ తీవ్రంగా స్పందించారు. చైనా ఇరాన్‌కు ఆయుధాలు పంపడం మానుకోవాలని, లేకపోతే బీజింగ్‌కు 'వినాశకర పరిణామాలు' తప్పవని హెచ్చరించారు. అమెరికాతో వాణిజ్య యుద్ధంలో చైనాకు 200% టారిఫ్‌లు విధించే అవకాశం ఉందని గతంలోనే ప్రకటించిన ట్రంప్, ఈసారి మరింత కఠినంగా మాట్లాడారు. 'మాకు నాటో నుంచి ఎటువంటి సాయం లభించలేదు. అయినా ఇరాన్‌ను సైనికపరంగా ఓడించాం. చర్చలు విఫలమైనా అంతిమ విజయం మాదే,' అని ట్రంప్ పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని 48 గంటల్లోగా తిరిగి తెరవకపోతే, ఇరాన్ విద్యుత్ కేంద్రాలను 'తుడిచిపెట్టేస్తామని' ఆయన బహిరంగంగా హెచ్చరించారు.వాషింగ్టన్‌లోని చైనా రాయబార కార్యాలయం ఈ ఆరోపణలను ఖండించింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఏ పక్షానికి ఎటువంటి ఆయుధాలు సరఫరా చేయలేదని పేర్కొంది. అయితే, ఇరాన్ అధికారికంగా చైనా ఆయుధాలు అందినట్లు వెల్లడించకపోయినా, తమ వద్ద ఉన్న ఆధునిక వ్యవస్థల సామర్థ్యాన్ని బట్టి చూస్తే చైనా సాయం స్పష్టంగా కనిపిస్తోందని అంతర్జాతీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చైనాకు ఇరాన్ నుంచి రోజుకు 20 లక్షల బ్యారెళ్ల ముడిచమురు సరఫరా అవుతోంది. ఈ ఆర్థిక బంధమే చైనా ఇరాన్‌కు రహస్య సాయం చేయడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది.ఈ పరిణామాలు మధ్యప్రాచ్యంలో కొత్త శక్తి సమీకరణాలకు దారితీస్తున్నాయి. చైనా?ఇరాన్ బంధం మరింత బలపడటం, ఆర్థిక, సైనిక సహకారం పెరగడం వల్ల అమెరికాకు ఇది సవాల్‌గా మారింది. నాటో దేశాలు ఈ యుద్ధంలో అమెరికాకు సాయం చేయకపోవడంతో అగ్రరాజ్యం ఒంటరిగా మారింది. హర్మూజ్ గుండా చమురు రవాణా ఆలస్యం కావడం వల్ల భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడే అవకాశం ఉంది.చైనా ఆయుధ సరఫరా ఇరాన్‌కు ఊపిరి పోసింది. అమెరికా సైనికపరంగా విజయం సాధించినా, చర్చలు విఫలమవడం మరియు చైనా రహస్య సాయం యుద్ధాన్ని మరింత సంక్లిష్టం చేశాయి. ట్రంప్ హెచ్చరికలను చైనా లెక్కచేయకపోతే, అమెరికా–చైనా మధ్య వాణిజ్య యుద్ధం మరింత ముదరే ప్రమాదం ఉంది. హర్మూజ్ జలసంధి తెరవడం, ఇరాన్‌తో చర్చలు విజయ వంతం కావడంపై మధ్యప్రాచ్య భవిష్యత్ ఆధారపడి ఉంది.పశ్చిమాసియా యుద్ధం మరింత విస్తరిస్తే.. అది భారత్‌కూ ఇబ్బందే. మన దేశ ఇంధన భద్రతకు హర్మూజ్ జలసంధి అత్యంత కీలకం. చమురు, సహజవాయువు సరఫరాలకు అంతరాయం కలిగితే.. దేశ ఆర్థిక వ్యవస్థపై అది తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది.

# దేశంలో భారీగా పెరగనున్న లోక్‌సభ స్థానాలు




ఢిల్లీ: కొత్త జనాభా లెక్కలు రావడానికి ముందే డీలిమిటేషన్ చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. లోక్‌సభ సీట్లను 543 నుంచి 850 సీట్ల వరకు పెంచాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో 815 స్థానాలు రాష్ట్రాల నుంచి, 35 స్థానాలు యూటీల నుంచి ఉండనున్నాయి. లోక్‌సభలో రాష్ట్రాల ప్రాతినిధ్యం వాటాలో ఎలాంటి మార్పు లేకుండా ఈ పెరుగుదల ఉండనుంది. అన్ని రాష్ట్రాలకు సమాన శాతాల్లో లోక్‌సభ సీట్ల పెరుగుదల ఉంటుంది. అంటే ప్రతి రాష్ట్రంలో ఇదివరకున్న ఎంపీ సీట్లల్లో 50 శాతం మేరకు పెరుగుదల ఉంటుందని తెలుస్తోంది. కాగా, పెరిగిన ఈ సీట్లకు అనుగుణంగా 33 శాతం మహిళా రిజర్వేషన్‌ను 2029 పార్లమెంటు ఎన్నికలకు ముందు నుంచే కేంద్రం అమలు చేయనుంది. లోక్‌సభతోపాటు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అసెంబ్లీ స్థానాల పునర్విభజన సైతం చేపట్టనుంది. ఆ చట్టసభల్లోనూ 33 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేయనుంది. ఈ మేరకు రాజ్యాంగ సవరణ బిల్లులను సిద్ధం చేసి ఎంపీలకు అందించింది. గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఈ సవరణలను ప్రవేశపెట్టి ఆమోదించుకోనుంది.

సెన్సస్ నుంచి డీలిమిటేషన్ కేంద్రంగా..: రాజ్యాంగంలో నిబంధనలు ప్రకారం, పునర్విభజన ప్రక్రియ చేపట్టాలంటే ముందుగా జనగణన చేపట్టాలి. ఆ జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలి. ఆ తర్వాత మహిళా కోటాను అమలు చేయాలి. సాధారణంగా ప్రక్రియ ఇలా జరగాలి. ఇలా ఇది వరకు జనాభా కేంద్రంగా ప్రక్రియ సాగేది. కానీ, ఈ సారి దాన్ని డీలిమిటేషన్ కేంద్రంగా మార్చినట్లు తెలుస్తోంది. జనాభా లెక్కలు పూర్తి కావడానికి ముందే గత జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ చేపట్టాలని కేంద్రం నిర్ణయించింది. 2023లో చట్టసభల్లో 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించే 'నారీ శక్తి వందన్ అధినియమ్' చట్టాన్ని కేంద్రం తీసుకొచ్చింది. తదుపరిగా జరిగే జనగణన తర్వాత అమల్లోకి తేవాలనే నిబంధన చట్టంలో పేర్కొన్నారు. ప్రస్తుతం మొదలైన జనగణన పూర్తయ్యాక డీలిమిటేషన్ చేపట్టాల్సి ఉంది. 2027లో జనగణన ప్రక్రియ పూర్తవ్వనుండగా.. గణాంకాలు ఆ తర్వాత అందుబాటులోకి రానున్నాయి. అనంతరం, డీలిమిటేషన్.. ఆ తర్వాత మహిళా కోటాను అమలు చేయాలి. అలా చేస్తే 2029 పార్లమెంటు ఎన్నికల వ్యవధి సైతం దాటే చాన్స్ ఉన్నది. అందుకే భారత ప్రజాస్వామ్యంలో మహిళా శక్తి భాగస్వామ్యాన్ని మరింత దీర్ఘకాలం వాయిదా వేయకూడదనే ఉద్దేశంతో కొత్త సవరణలు తెస్తున్నట్టు తాజా డ్రాఫ్ట్ బిల్లులో కేంద్రం తెలిపింది. ఇందుకోసం అవసరమైన రాజ్యాంగ సవరణలతో మూడు బిల్లులను సిద్ధం చేసింది.

కీలక సవరణలు..: అవాంతరాలను అధిగమించి జనగణన పూర్తికావడానికి ముందే.. అంటే గత జనాభా లెక్కల ఆధారంగానే డీలిమిటేషన్ చేపట్టి.. 2029 ఎన్నికలకు ముందే మహిళా కోటా అమలు చేయడానికి కేంద్రం మూడు రాజ్యాంగ సవరణ బిల్లులను సిద్ధం చేసింది. 131 వ రాజ్యాంగ సవరణ బిల్లు 2026, డీలిమిటేషన్ బిల్లు 2026, యూటీ చట్టాల సవరణ బిల్లు 2026ను గురువారం పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టనుంది. ఈ బిల్లులతో 2023లో ఆమోదించిన మహిళా కోటా చట్ట అమలుకు జనగణన, డీలిమిటేషన్‌తో లంకె తెంచనుంది. డీలిమిటేషన్‌కు ప్రాతిపదికగా పార్లమెంటులో సూచించిన జనాభా లెక్కలను స్వీకరించే నిబంధన తేనుంది. డీలిమిటేషన్‌పై 2026 వరకున్న ఫ్రీజ్‌ను తొలగించి, ప్రస్తుతం గరిష్ట లోక్‌సభ సీట్ల సంఖ్యను 550 నుంచి 850 వరకు పెంచే వెసులుబాటును తీసుకురానుంది.

131వ రాజ్యాంగ సవరణతో ఆర్టికల్ 81ను సవరించి లోక్‌సభ సీట్ల సంఖ్యను 550 నుంచి 850కు కేంద్రం పెంచనుంది. 1971 జనగణనకు లోబడని లోక్‌సభ సీట్ల సంఖ్య, 2001 జనగణనకు లోబడిన అసెంబ్లీల సీట్ల సంఖ్యపై ఆర్టికల్ 81(2), (3)లతో ఫ్రీజ్ అమల్లో ఉన్నది. దీన్ని పైసవరణ తొలగిస్తుంది. ప్రతిజనగణన తర్వాత పునర్విభజన అనే పదాన్నిపునర్విభజనగా మార్చడానికి, ప్రతి జనగణన తర్వాత లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన పదాన్ని తొలగించడానికి ఆర్టికల్ 82ను సవరిస్తున్నారు. రాష్ట్రాల అసెంబ్లీలకు, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు సంబంధించి పార్లమెంటు సూచించిన జనగణన అనే పదాన్ని పై సవరణతో చేరుస్తున్నారు. మొత్తంగా ఆర్టికల్ 82, 170 సవరణలతో 2026 తర్వాత చేపట్టే జనగణన అనే తప్పనిసరి నిబంధనను తొలగిస్తూ.. గత జనగణన ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన అధికారాన్ని డీలిమిటేషన్ కమిషన్‌కు కల్పించనుంది.

సుప్రీం జడ్జీ చైర్మన్‌గా కమిషన్..: ఈ మహా కార్యం చేపట్టడానికి బిల్లులు ప్రత్యేకంగా ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించాయి. ఇందుకోసం సుప్రీంకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటవుతుంది. ఇందులో సీఈసీ, రాష్ట్రాల ఎన్నికల కమిషనర్లు సభ్యులుగా ఉంటారు. ఈ కమిషన్ సివిల్ కోర్ట్ హోదాను కలిగి ఉంటుంది. రాష్ట్రాల్లో సీట్ల కేటాయింపులు, నియోజకవర్గ పరిధుల పునర్విభజనలతోపాటు ఎస్సీ, ఎస్టీ, మహిళా రిజర్వేషన్లను నిర్ధారిస్తుంది.

మహిళా కోటా.. రొటేషన్..: ఈ చట్టం అమల్లోకి వచ్చాక పార్లమెంట్, రాష్ట్రాల శాసనసభల్లో మొత్తంగా 33 శాతం రిజర్వేషన్లు మహిళలకు అమలవుతాయి. ఎస్సీ, ఎస్టీ కోటాల్లోనూ 33 శాతం రిజర్వేషన్ ఉంటుంది. ప్రతి డీలిమిటేషన్ తర్వాత మహిళా కోటా రొటేషన్ అమలవుతుంది. మహిళా రిజర్వేషన్ 15 ఏళ్ల వరకు ఉంటుంది. ఆ తర్వాత పార్లమెంటు ద్వారా అవసరమైన మేరకు పొడిగించుకునే వెసులుబాటు ఉంటుంది. మహిళా చట్టం 2023 ప్రకారం 2026 తర్వాత చేపట్టే జనగణన లెక్కల ఆధారంగా కోటా నిర్ణయించాలి. ఇది సుదీర్ఘకాలం మహిళా కోటాను వాయిదా వేసినట్టు అవుతుందని, అందుకే ముందస్తుగా అమలు చేయడానికి సవరణలు తెచ్చినట్లు కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్‌మేఘవాల్ వివరించారు. ఈ చట్టం అమల్లోకి వచ్చాక జరిగే రాష్ట్రాల అసెంబ్లీలు, ఉపఎన్నికలకు సైతం మహిళా కోట అమలవుతుందని స్పష్టం చేశారు. అంటే 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు నుంచే మహిళా కోటా అమల్లోకి రావొచ్చని వివరించారు.

అసెంబ్లీ సీట్లు 500 దాటొద్దు: ఆర్టికల్ 333 ప్రకారం రాష్ట్రాల అసెంబ్లీ సీట్లు గరిష్టంగా 500కు మించకూడదు. అలాగే, 60కి తక్కువగా ఉండకూడదు. ఈ షరతును దృష్టిలో పెట్టుకుని రాష్ట్రాల నియోజవకర్గాల పునర్విభజన చేపట్టాల్సి ఉంటుంది. ప్రతి నియోజక వర్గానికి దాదాపుగా సమాన ప్రాతినిధ్యం ఉండేలా జాగ్రత్త వహించాలి.

## రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన




పటాన్ చెరు (తెలంగాణ వాణి రిపోర్టర్) అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పటాన్ చెరు ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో పటాన్ చెరు లోని శిశు విహార్ పాఠశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నియమాల పై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించడం, సీటు బెల్ట్ పెట్టుకోవడం యొక్క ప్రాముఖ్యతను ట్రాఫిక్ పోలీసులు వివరించి, తమ తల్లిదండ్రులు తప్పనిసరిగా హెల్మెట్ సీటు బెల్ట్ ధరించేలా తమ తల్లిదండ్రులను కోరాలని విద్యార్థులను ప్రేరేపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గీతాంజలి పాఠశాలలో రోడ్డు భద్రత అవగాహనా సదస్సు కార్యక్రమం




నర్సంపేట (తెలంగాణ వాణి ప్రతినిధి): నిత్యం మనలను కలవర పెట్టే వార్తలలో ముందు నిలిచేవి రోడ్డు ప్రమాదాలు వాటిని నివారించేందుకు ప్రజలలో అవగాహన కల్పించాలని సంకల్పంతో గీతాంజలి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో రోడ్డు భద్రత అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కొర్ర సారయ్య పాల్గొని విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలకు కారణమయ్యేటువంటి హెల్మెట్ ధరించకపోవడం సీటు బెల్టు పెట్టుకోకపోవడం ఓవర్ స్పీడ్ ఓవర్ లోడ్ ఇలా అనేక కారణాలవల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని మనం నియంత్రించగలిగే ఏకైక మార్గం ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించడం అని తెలియజేశారు.

అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్ రాజేష్ విద్యార్థులతో కలిసి పాఖాల రోడ్డు కూడలి వద్దకు రోడ్డు భద్రత నినాదాలతో ర్యాలీ నిర్వహించి ప్రజల్లో అవగాహనకల్పించారు. అక్కడ మాట్లాడిన ప్రిన్సిపాల్ విద్యార్థులకు మీ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూడాలని తెలిపారు. ఒక చిన్న నిర్లక్ష్యం ఒక నిండు ప్రాణంతో పాటు ఇరు భాదిత కుటుంబాలను రోడ్డున పడేలా చేస్తాయని అలా జరగకుండా వారి కుటుంబంతో ఆనందంగా గడపడానికి రోడ్డు భద్రత సూచనలు తప్పనిసరిగా పాటించాలని హితువు పలికారు.

## పిల్లలకు జంకు ఫుడ్ పై అవగాహన ర్యాలీ



జగిత్యాల/వెల్గటూర్ (తెలంగాణ వాణి ప్రతినిధి) పోషణ పఖ్వాడా కార్యక్రమం సందర్భంగా, వెల్గటూర్ వన్ సెక్టార్ పరిధిలోని రాజక్కపల్లి అంగన్వాడి కేంద్రంలో గ్రామ సర్పంచ్ దోరిశెట్టి మల్లేశం అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ దోరిశెట్టి మల్లేశం మాట్లాడుతూ పిల్లలను చిన్న వయస్సు నుంచే మంచి విలువలతో పెంచి, వారికి ఉత్తమ విద్యను అందించాలని సూచించారు. పిల్లలు భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్ వంటి ఉన్నత ఉద్యోగాలు సాధించేలా ప్రోత్సహించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, వారి అభివృద్ధికి సహకరించాలని ఆయన సూచించారు. జంక్ ఫుడ్ వినియోగాన్ని తగ్గించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రత్యేక ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సెక్టార్ సూపర్వైజర్ స్వప్న మాట్లాడుతూ, ఆరు సంవత్సరాల లోపు పిల్లల మెదడు సుమారు 80 శాతం వరకు అభివృద్ధి చెందుతుందని, ఈ కీలక దశలో పిల్లలకు పోషక విలువలతో కూడిన సమతుల్య ఆహారం అందించడం అత్యంత అవసరమని తెలిపారు.

అలాగే, సరైన సమయంలో పిల్లల వయసుకు తగిన బరువు, ఎత్తు పెరుగుదల జరుగుతున్నాయా లేదా, అలాగే సరైన సమయంలో నడవడం, మాట్లాడడం, పరుగెత్తడం వంటి అభివృద్ధి మైలురాళ్లు సాధిస్తున్నారా లేదా అనే విషయాలను తల్లిదండ్రులు తప్పకుండా గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి స్రవంతి, గ్రామ పాలక మండలి సభ్యులు బొడ్డు రమేష్, బోడకుంటి తిరుపతి, బోడకుంటి పోచయ్య, కొల్లూరి జితేందర్ , అంగన్వాడి టీచర్ దోరిశెట్టి తిరుమల, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగరాజు, పిల్లల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కాంట్రాక్ట్ కమీషన్లకు కక్కుర్తిపడి రైతుల కడుపులు కొడతారా

### మా అనుమతి లేకుండా మా భూమి ఆక్రమిస్తున్నారు

### రాయికల్ రైతుల అవేదన



రాయికల్ (తెలంగాణ వాణి) : రాయికల్ పట్టణంలో గతం నుండి ట్యాంకుల నిర్మాణం పేరుతో దాదాపు 6కి పైగా వాటర్ ట్యాంకులు కలిగి ఉన్నాయని,అందులో ఒక మెగా వాటర్ ట్యాంకులో ఇటీవల మండలానికి పూర్తిగా నీటి సరఫరా చేయగలిగిన సామర్థ్యం ఉందని రైతులు తెలిపారు. కాంట్రాక్టర్లకు కమీషన్ల కక్కుర్తికి పడి తమ భూములను బలవంతంగా లాక్కొని, అనవసరంగా వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పంట పొలాల్లో గత ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పేరుతో మిగిలిపోయిన మున్సిపల్ నిధులను దుర్వినియోగం చేయాలని చూస్తున్నారని అయినా అవసరం లేని చోట మరో వాటర్ ట్యాంకును నిర్దేశించి, తమ అనుమతి లేకుండానే పట్టా భూములను లాక్కొని నిర్మాణం చేపట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. రాయికల్ పట్టణానికి చెందిన సర్వేనెంబర్లు 988/2/1/1, 988/2/1/2, 988/2/1/3 పరిసరాల్లోని రైతుల పంట పొలాలను కూడా లక్ష్యంగా చేసుకొని ప్రైవేటు నిర్మాణాలకు సర్కిల్ చేశారని తెలిపారు. ఈ అనవసర వాటర్ ట్యాంకు నిర్మాణం వల్ల 80 రైతు కుటుంబాలకు పంటకు నష్టం, మూడు రైతు కుటుంబాలు పూర్తిగా భూములను కోల్పోయి కనీస ఆదాయం లేక ఆకలిబాధలు పడే పరిస్థితి నెలకొందని వాపోయారు. దీనివల్ల సిమెంటు రోడ్లు, భారీ రోడ్లు, మురికి కాలువలు, వీధి కరెంటు పోల్స్‌కు కూడా ఇబ్బంది ఏర్పడుతుందని వివరించారు. తమ భూములను ఇవ్వమని చెప్పినను అభ్యంతరం లేకుండా లాక్కున్నారని, రైతు కుటుంబాలపై ఒత్తిడి వల్ల ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఇదంతా కాంట్రాక్టర్ల ధనార్జనే లక్ష్యంగా సాగుతోందని ఆరోపించారు. గ్రామానికి నిజంగా నీరందించాలనే సంకల్పం ఉంటే, పట్టణంలో ఉన్న 6 వాటర్ ట్యాంకులను, మెగా ట్యాంకును సక్రమంగా వాడుకోకుండా మళ్లీ తమ భూములనే టార్గెట్ చేయడం ఏంటని ప్రశ్నించారు.

ప్రభుత్వ స్థలం ఉండగా తమ కుటుంబాలనే ఇబ్బంది పెట్టడం సరికాదని,వెంటనే అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, పట్టా భూముల్లో కొత్త నిర్మాణాలు చేపట్టవద్దని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు కూర్మ మల్లారెడ్డి, కుర్మ నారాయణ రెడ్డి, కుర్మ ప్రేమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహనతోనే ప్రమాదాల నివారణ

### విద్యార్థులు మార్గదర్శకులుగా నిలవాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి బ్యూరో (తెలంగాణ వాణి) ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న "అరైవ్ – అ లైవ్" కార్యక్రమంలో భాగంగా బుధవారం పాత కొత్తగూడెం హనుమాన్ బస్తీ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ అంకిత్ ఘనంగా ప్రారంభించారు. "రహదారుల భద్రత మన అందరి బాధ్యత" అనే నినాదంతో ప్రారంభమైన ఈ ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రోడ్డు భద్రతపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ రహదారుల భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన కల్పించడం అత్యంత కీలకమని అన్నారు . చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై అవగాహన పెంపొందితే భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని అన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు, బంధువులు, ఉపాధ్యాయులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, కార్లలో ప్రయాణించే సమయంలో సీట్ బెల్ట్ ధరించాలనే విషయాన్ని గుర్తుచేయాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్ వినియోగం, రోడ్డు నియమాల పాటింపు వంటి అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పాఠశాలల్లో రోడ్డు భద్రతపై పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు ప్రత్యేక అవగాహనా తరగతులు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో ర్యాలీలు, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో భద్రతపై చైతన్యం పెంపొందించాలన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, ఈ ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. "అరైవ్ – – అ లైవ్" కార్యక్రమం ద్వారా ప్రజల్లో రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించడం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏం ఈ ఓ మధురవాణి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మి, కోఆర్డినేటర్ నాగశేఖరా శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంబంధిత శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# సింగరేణికి లిథియం ముప్పు?



తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఇటీవల తీసుకున్న నిర్ణయం- లిథియం రంగంలోకి అడుగుపెట్టడం. ఇది సాధారణ పెట్టుబడి నిర్ణయం కాదు. సంస్థ భవిష్యత్తు దిశను మార్చే కీలక మలుపు. ఈ నేపథ్యంలో ఎలాంటి అనుభవం, పెద్ద మొత్తంలో పెట్టుబడి, ఒక అనామక సంస్థ, ఆల్ట్‌మిన్ ప్రైవేట్ లిమిటెడ్ (భారతీయ బ్యాటరీ ముడిపదార్థాల స్టార్టప్)తో కుదిరిన లిథియం రిఫైనరీ ఒప్పందం ఎంతవరకు ప్రయోజనకరం? ప్రమాదకరం? అన్నది కార్మికవర్గాల్లో, ప్రజల్లో తలెత్తుతున్న ప్రశ్న. రూ.10 లక్షల అధీకృత మూలధనం, రూ.లక్ష చెల్లించిన మూలధనంతో, 2023లో ప్రారంభమైన సంస్థతో, సింగరేణి కాలరీస్ వారు రూ.2,250 కోట్ల ఒప్పందం కుదుర్చుకోవడం పారిశ్రామిక వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. గతంలో ఎలాంటి పారిశ్రామిక అనుభవంలేని ఒక సంస్థతో, ప్రపంచంలోనే అత్యంత విలువైన, ఆధునికమైన లిథియం లాంటి ప్రమాదకరమైన ధాతువును శుద్ధి చేసే ప్రాజెక్ట్ నెలకొల్పడానికి, సింగరేణి సంస్థ ఒప్పందం చేసుకోవడం పారిశ్రామిక వర్గాలను ఆశ్చ ర్యాన్ని గురిచేస్తున్నది. ఇందులో పారిశ్రామిక లాభాలకన్నా, రాజకేయ లాభాలే ఎక్కువగా ఉన్నట్టు ప్రచారం జరుగుతున్నది.

ప్రపంచం వేగంగా ఎలక్ట్రిక్ వాహనాల వైపు సాగుతున్నది. లిథియం లేకుండా ఈ మార్పు అసాధ్యం. ఈ నేపథ్యంలో దేశీయంగా లిథియం ఉత్పత్తి చేయాలన్న లక్ష్యంసూత్రప్రాయంగా సరైనదే. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడం, భవిష్యత్తు ఎనర్జీ అవసరాలకు సిద్ధం కావడం సింగరేణి తీసుకున్న నిర్ణయానికి బలం చేకూర్చేఅంశాలు. లిథియంపరిశ్రమ ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని నిలదొక్కుకోవాల్సిన పరిశ్రమ. దీనివల్లకాలుష్యం కూడాఎక్కువే. కానీ ప్రశ్న ఏమిటంటే ఈ ప్రయోగం సక్రమంగాఅమలవుతుందా? లేక, రాజకీయ అవసరాలకు ఏర్పడ్డ మరోసంస్థానా? అనేసందేహాలు తలెత్తుతున్నాయి. హైదరాబాద్‌కు చెందిన బ్యాటరీ యాక్టివ్ మెటీరియల్స్ తయారీ సంస్థ ఆల్ట్‌మిన్ ప్రైవేట్ లిమిటెడ్ బొలీవియాలోని ప్రభుత్వ లిథియం సంస్థ యాసిమియంటోస్ డిలిటియో బొలీవియానోస్ (వైఎల్‌బీ)తో కీలక వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకున్నది. ఈ ఒప్పందం ద్వారా లిథియం ముడి పదార్థాల సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేయటంతోపాటు, లిథియం-అయాన్ బ్యాటరీల కోసం అవసరమైన క్యాథోడ్ యాక్టివ్ మెటీరియల్స్ (సీఏఎం) ఉత్పత్తిపై దృష్టి పెట్టనున్నారు. ఈ భాగస్వామ్యంలో భాగంగా, బొలీవియాలోని పోటోసీ ప్రాంతంలోని లా పాల్మా వద్ద ఒక పైలట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్లాంట్‌లో ఆల్ట్‌మిన్ అభివృద్ధి చేసిన పేటెంట్ పొందిన సీ-ఎల్ఎఫ్‌పీ (కార్బన్ పూత పూసిన లిథియం ఐరన్ ఫాస్ఫేట్) సాంకేతికతను వినియోగిస్తారు. ఇది సురక్షితమైనది, ఖర్చు తక్కువగా ఉండేది కావడంతో ఎలక్ట్రిక్ వాహనాలు (ఈవీలు), శక్తి నిల్వ వ్యవస్థల్లో విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం ఆస్ట్రేలియా, చిలీ, అర్జెంటీనా దేశాలు ఈ ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉండగా, భారతదేశం కూడా సొంత నిల్వలను వెలికితీసే దిశగా అడుగులు వేస్తున్నది. ఈ భాగస్వామ్యం బొలీవియాలో మొదటిసారిగా స్వదేశీ లిథియం-అయాన్ బ్యాటరీ తయారీకి దారి తీస్తున్నది. ఇప్పటివరకు ప్రధానంగాముడి లిథియం ఎగుమతులపైనేఆధారపడిన బొలీవియా, ఇప్పుడు విలువ ఆధారితఉత్పత్తుల తయారీలోకిప్రవేశిస్తున్నది. ఆల్ట్‌మిన్ సంస్థ స్థాపకుడు మౌర్య సుంకవల్లి చెప్తున్న వివరాల ప్రకారం ఈ ఒప్పందం ద్వారా కంపెనీ గ్లోబల్ స్థాయిలో విస్తరించడంతో పాటు, 2030 నాటికి 10 జీఈడబ్ల్యూహెచ్. వరకు ఎల్ఎఫ్‌పీ బ్యాటరీ మెటీరియల్స్ ఉత్పత్తి సామర్థ్యాన్ని చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నది.

ఈ ఒప్పందంలో మొదటగా భాగస్వామి ఎంపికపై సందేహాలు తలెత్తుతున్నాయి. ఆల్ట్‌మిన్ ఒక కొత్త సంస్థ. పెద్ద స్థాయి పారిశ్రామిక ప్రాజెక్ట్‌ను విజయవంతంగా పూర్తి చేసిన అనుభవం లేదు. ప్రభుత్వ రంగ దిగ్గజమైన సింగరేణి, ఇటువంటి కీలక ప్రాజెక్ట్‌లో ఒక స్టార్టప్‌పై ఆధారపడటం ఎంతవరకు సురక్షితం? అనేది ప్రశ్న. ఈ సంస్థలో ఉన్న భాగస్వాముల అనుభవం శూన్యం. ఇందులో రాజకీయ నాయకుల స్వార్థమే తప్ప, సింగరేణి సంస్థ భవిష్యత్తు మాత్రం కనబడటం లేదని కార్మికవర్గాలు విమర్శిస్తున్నాయి.

భారతదేశంలో పెద్ద ప్రాజెక్టులు ఆలస్యం కావడం కొత్త విషయం కాదు. ఖర్చులు పెరగడం, సాంకేతిక సమస్యలు తలెత్తడం, అనుమతుల ప్రక్రియలు నిలిచిపోవడం- ఇవి అన్నీ సాధారణ సమస్యలు. ఈ ప్రాజెక్ట్ కూడా ఆ గండాలను దాటుతుందా? లేక అదే దారిలో నడుస్తుందా? సింగరేణి సంస్థలో వేలాది మంది కార్మికులు కోల్ మైనింగ్‌లో నైపుణ్యం కలిగినవారు. కానీ లిథియం రిఫైనింగ్ పూర్తిగా వేరు రంగం. కొత్త నైపుణ్యాలు అవసరం. ఈ మార్పులో ప్రస్తుత కార్మికులకు స్థానం ఏమిటి? వారికి రీస్కిల్లింగ్ అవకాశాలు కల్పిస్తారా? లేక ఈ మార్పు వారికి ప్రమాదమవుతుందా? అయితే ఈ నిర్ణయాన్ని పూర్తిగా తప్పు అని కూడా చెప్పలేం. మొత్తానికి ఈ లిథియం ప్రాజెక్ట్ ఒక అవకాశం, ఒక ప్రమాదం. సరైన ప్రణాళిక, పారదర్శక అమలు, బాధ్యతాయుత నిర్వహణ ఉంటే ఇది తెలంగాణను ఎనర్జీ రంగంలో ముందుకు తీసుకెళ్లగలదు. కానీ అదే నిర్లక్ష్యం, ఆలస్యం, అనుభవ లోపం ఉంటే ఇది వేల కోట్ల రూపాయల ప్రయోగంగా మిగిలిపోవచ్చు. ఈ పరీక్షలో విజయం సాధిస్తుందా? లేక మరో ప్రభుత్వ ప్రయోగంగా మిగిలిపోతుందా? కాలమే సమాధానం చెప్తుంది.

## ఓఆర్ఆర్‌పై రోడ్డు ప్రమాదం..

### చెట్లకు నీళ్లు పోస్తున్న ట్యాంకర్ ఢీకొని తండ్రి, రెండేళ్ల చిన్నారి దుర్మరణం



హైదరాబాద్: హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్ రోడ్డుపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. చెట్లకు నీళ్లు పోస్తున్న ట్యాంకర్ ఢీకొని తండ్రి, రెండున్నరేళ్ల కుమారుడు దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. హన్మకొండకు చెందిన కాటంగూరి వేద ప్రకాశ్ రెడ్డి (37) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం హన్మకొండలో దేవుడి పండుగ ఉండటంతో కుటుంబంతో కలిసి తన కారులో బెంగళూరు నుంచి వచ్చాడు. మంగళవారం నాడు భార్య హిమబిందు, రెండున్నరేళ్ల కొడుకు అర్జున్‌తో పాటు కజిన్ దుర్గాప్రసాద్, అతని భార్య శ్రీజతో కలిసి తన కారులో బెంగళూరు బయల్దేరాడు. ఈ క్రమంలో ఘట్‌కేసర్ వద్ద ఓఆర్ఆర్ ఎక్కారు. పెద్ద అంబర్‌పేట వద్ద నీళ్లు పోస్తున్న ట్యాంకర్‌ను ఢీకొట్టాడు. దీంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో ముందు కూర్చున్న వేద ప్రకాశ్, అతని కొడుకు అర్జన్ అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మిగిలిన ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. కాగా, మిగతా ముగ్గురి పరిస్థితి కూడా విషమంగానే ఉందని పోలీసులు తెలిపారు.

# ఎల్పీజీ కష్టాలకు చెక్...



హైదరాబాద్, : పశ్చిమాసియా యుద్ధం కారణంగా ఎల్పీజీ సరఫరాలో తలెత్తే ఇబ్బందులను అధిగమించడానికి రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో పైపుల ద్వారా సహజ వాయువు పంపిణీని ప్రభుత్వం వేగవంతం చేసింది. గోదావరి బేసిన్ నుంచి పూడూరు ప్లాంట్ ద్వారా గ్యాస్‌ను తీసుకుని ఇళ్లకు సరఫరా చేసేందుకు భాగ్యనగర్, మెగాసిటీ గ్యాస్ ఏజెన్సీలు సిద్ధమవుతున్నాయి. పైప్‌లైన్ల నిర్మాణానికి 24 గంటల్లోనే వాట్సప్ ద్వారా అనుమతులు ఇచ్చేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇరాన్-ఇజ్రెయిల్ యుద్ధం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలతో ప్రస్తుతం గ్యాస్ కొరత ఏర్పడింది. బుక్ చేసిన నెల రోజులకు కూడా సిలిండర్ దొరకని పరిస్థితి. గ్యాస్ కోసం ఏజెన్సీల ముందు బారులు తీరుతున్నారు. మారుతున్న అంతర్జాతీయ పరిణామాల దృష్ట్యా ఇంధన భద్రతపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రస్తుతం ఎల్పీజీ సరఫరాకు ఆటంకాలు కలగకుండా ఉండేందుకు.. పైపుల ద్వారా సహజ వాయువును నేరుగా ఇళ్లకు సరఫరా చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్ శివారు జిల్లాలైన రంగారెడ్డి, మేడ్చల్‌లో ఈ ప్రాజెక్టును వేగవంతం చేస్తోంది. ఈ భారీ ప్రాజెక్టుకు మూలం గోదావరి బేసిన్. కాకినాడ నుంచి ముంబై మీదుగా అహ్మదాబాద్ వరకు సాగే ప్రధాన గ్యాస్ పైప్‌లైన్ మేడ్చల్ జిల్లా పూడూరు గ్రామం మీదుగా వెళ్తోంది. ఇక్కడ ఉన్న ఎల్పీజీ నిల్వ ప్లాంట్ ద్వారా గ్యాస్‌ను సేకరించి అక్కడి నుంచి భాగ్యనగర్ గ్యాస్ ఏజెన్సీ లిమిటెడ్, మెగాసిటీ గ్యాస్ ఏజెన్సీలు వినియోగదారులకు పంపిణీ చేయనున్నాయి. దీనివల్ల సిలిండర్ల బుకింగ్, డెలివరీ కోసం వేచి చూడాల్సిన అవసరం ఉండదు. ప్రాజెక్టు వేగంగా పూర్తి కావడానికి రంగారెడ్డి, మేడ్చల్ కలెక్టర్లు సి.నారాయణరెడ్డి, మనుచౌదరిలు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. పైప్‌లైన్ల నిర్మాణానికి రోడ్లు తవ్వాల్సి ఉంటుంది. దీని కోసం దరఖాస్తు చేసిన 24 గంటల్లోనే అనుమతులు ఇచ్చేలా ప్రత్యేక కమిటీని నియమించారు. అనుమతుల ప్రక్రియను సులభతరం చేస్తూ ఒక ప్రత్యేక వాట్సప్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఏజెన్సీలు తమ దరఖాస్తులను ఇందులోనే పంపవచ్చు. మొదటి విడతలో భాగంగా సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్లతో పాటు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని తొమ్మిది మున్సిపాలిటీలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పీఎన్‌జీ వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా.. సురక్షితంగా నిరంతరాయంగా అందుబాటులో ఉంటుంది. గృహ వినియోగదారులతో పాటు అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, రెస్టారెంట్లకు కూడా ఈ సౌకర్యం అందుబాటులోకి రానుంది. ఈ పైప్‌లైన్ నెట్‌వర్క్ పూర్తయితే.. హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో ఇంధన వినియోగం సరికొత్త పుంతలు తొక్కనుంది.

# డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా తెలంగాణ



హైదరాబాద్, : తెలంగాణ ప్రభుత్వం మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా 35 అడిక్షన్ ట్రీట్‌మెంట్ ఫెసిలిటీ కేంద్రాలను ప్రారంభించింది. గాంధీ ఆసుపత్రిలో ప్రత్యేక ఎస్ఐసీయూ, కౌన్సెలింగ్ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ఙఉంఔః అందించే అత్యాధునిక కిట్‌ల ద్వారా 12 రకాల డ్రగ్స్‌ను నిమిషాల్లోనే గుర్తిస్తున్నారు. బాధితులకు 6 వారాల పాటు పునరావాసం కల్పిస్తూ.. చట్టపరమైన నిబంధనల ప్రకారం చికిత్స అందించడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రాన్ని డ్రగ్ ఫ్రీ స్టేట్‌గా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. ఇప్పటికే నార్కోటిక్ విభాగంతో పాటు ఈగల్ టీమ్స్ ఏర్పాటు చేసి మత్తుపై ఉత్తుపాదం మోపుతోంది. ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహిస్తూ.. గంజాయి, కొకైన్ ఇతర డ్రగ్స్ ముఠాలను కట్టడి చేస్తున్నారు. ఇటీవల కాలంలో చాలా చోట్ల దాడులు నిర్వహించి పలువుర్ని అరెస్టు చేశారు. రాష్ట్రంలో మత్తు పదార్థాల వినియోగం ఒక సామాజిక విపత్తుగా మారుతున్న తరుణంలో.. తెలంగాణ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. డ్రగ్స్, ఇతర మాదకద్రవ్యాల వ్యసనం నుంచి ప్రజలను కాపాడేందుకు రాష్ట్రవ్యాప్తంగా 35 రిహాబిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో ఈ సేవలను లాంఛనంగా ప్రారంభించడంతో పాటు.. అన్ని జిల్లాల్లోనూ ఏకకాలంలో వీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సహకారంతో ఈ కేంద్రాల్లో మల్టీ-డ్రగ్ టెస్ట్ కిట్‌లను సరఫరా చేశారు. ఈ కిట్‌ల ద్వారా గంజాయి, ఓపియాయిడ్స్, కొకైన్, యాంఫెటమైన్స్ వంటి దాదాపు 12 రకాల మాదకద్రవ్యాలను మూత్ర పరీక్ష ద్వారా కేవలం నిమిషాల్లోనే గుర్తించవచ్చు. గాంధీ ఆసుపత్రి సైకియాట్రీ హెచ్‌వోడీ డాక్టర్ కె. అనుపమ తెలిపిన వివరాల ప్రకారం.. కిట్‌లో ఎరుపు గీత కనిపించకపోతే సదరు వ్యక్తి డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారిస్తారు. అయితే ఇవి కేవలం ప్రాథమిక పరీక్షలు మాత్రమే. అవసరమైతే మరిన్ని లోతైన క్లినికల్ పరీక్షలు నిర్వహిస్తారు. గత రెండు రోజుల్లో 90 మందికి పరీక్షలు చేయగా.. సుమారు 40 మందికి పాజిటివ్ వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. తీవ్రమైన వ్యసనానికి గురైన వారు లేదా మత్తు పదార్థాలు అందక శారీరకంగా ఇబ్బంది పడే వారి కోసం సబ్‌స్టెన్స్ ఇంటాక్సికేషన్ కేర్ యూనిట్‌ను ఏర్పాటు చేశారు. ఇది ఐసీయూ తరహాలోనే పనిచేస్తుంది. డ్రగ్స్ మానేయడం వల్ల వచ్చే ఫిట్స్, స్పృహ కోల్పోవడం వంటి పరిస్థితుల్లో రోగులను ఇక్కడ చేర్చుకుని నిరంతర పర్యవేక్షణలో చికిత్స అందిస్తారు. పోలీసులు తీసుకొచ్చే నిందితుల విషయంలో ప్రభుత్వం పక్కాగా నిబంధనలు అమలు చేస్తోంది.

నిందితులను పరీక్షల కోసం ఫారమ్ ంతో తీసుకొస్తారు. ఫలితాలను ఫారమ్ ఃలో నమోదు చేస్తారు. నిందితుడు చికిత్సకు అంగీకరిస్తే ఫారమ్ అ ద్వారా అడ్మిషన్ ప్రక్రియ చేపడతారు. చికిత్స తర్వాత రోగులను డ్రగ్ అడిక్షన్ కౌన్సెలింగ్ సెంటర్స్‌కు పంపిస్తారు. ఇక్కడ ఆరు వారాల పాటు నిపుణుల పర్యవేక్షణలో కౌన్సెలింగ్, ఫ్యామిలీ థెరపీ, నార్కోటిక్స్ అనానిమస్ వంటి గ్రూప్ సెషన్లు నిర్వహిస్తారు. వ్యసనం అనేది ఒక వ్యాధి అని దానిని చికిత్స ద్వారా నయం చేయవచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది యువత తిరిగి సాధారణ జీవితం గడిపే అవకాశం కలుగుతుందని అంటున్నారు.

# కాసులు కురిపిస్తున్న ఓపెన్ బార్లు

హైదరాబాద్, ఏప్రిల్ 15,:మామూళ్ళ మత్తులో అధికారులు తూగుతుండగా మద్యం దుకాణ వ్యాపారులు ఇష్టారీతిగా దందా కొనసాగిస్తూ భారీ స్థాయిలో వినియోగదారుల జేబుకు చిల్లు పెడుతున్నారు. నిబంధనలను పక్కనబెట్టి వైన్స్ మాఫియా పెట్రేగిపోతుంది. రామచంద్రపురం మండల పరిధిలో వైన్స్ షాపుల చుట్టూ జరుగుతున్న అక్రమాలు రోజురోజుకూ బహిరంగ రూపం దాల్చుతున్నాయి. పార్కింగ్ పేరుతో చూపిస్తున్న ప్రదేశాలు పూర్తిస్థాయి ఓపెన్ బార్లుగా మారిపోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వాహనాల్లో కూర్చొని మద్యం సేవించడం, కార్ల దగ్గరకే మద్యం సరఫరా చేయడం వంటి ఘటనలు నిత్యకృత్యంగా మారినట్లు చెబుతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్లను ఆసరాగా చేసుకుని ఓపెన్ ప్లేస్లలో భారీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. మ్యాచ్ల వీక్షణ పేరుతో టేబుళ్లను, కుర్చీలు ఏర్పాటు చేసి బహిరంగంగా మద్యం సేవనానికి అవకాశం కల్పిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో రాత్రివేళల్లో పెద్ద ఎత్తున గుంపులుగా చేరి హంగామా చేస్తున్నట్లు చెబుతున్నారు. కొన్ని వైన్స్ షాపులు పర్మిట్ గదుల పరిమితులను పట్టించుకోకుండా పెద్ద హాళ్లు ఏర్పాటు చేసి భారీ సంఖ్యలో మద్యం ప్రియులను కూర్చోబెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది నిబంధనలకు విరుద్ధం. భారీ స్థాయిలో షెడ్లను ఏర్పాటు చేసి మినీ బార్లుగా తీర్చిదిద్ది మద్యం ప్రియుల జేబులు గుల్ల చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేగాకుండా పార్కింగ్ స్థలాల్లో కార్లలోనే మద్యం సేవించడం, షాప్ సిబ్బంది కార్ల దగ్గరకే వెళ్లి మద్యం అందించడం బహిరంగంగా కొనసాగుతుంది. ఇది చట్టాలను బహిరంగంగా ఉల్లంఘించడమేనని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం యజమానులు ధనార్జనే ధ్యేయంగా ఇష్టారీతిగా అమ్మకాలు చేపడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మద్యం వ్యాపారులు బహిరంగంగా అక్రమాలకు పాల్పడుతున్నా అబ్కారీ శాఖ షరా మామూళ్ళే అన్నట్లుగా వ్యవహరిస్తోంది. నెలవారీగా సంబంధిత అధికారులకు పెద్ద ఎత్తున మామూళ్ళు అందుతున్నాయని, అందుకే మద్యం దుకాణాల వైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా విజిలెన్స్ అధికారులతో పాటు ఎక్సైజ్, పోలీసు అధికారులు వెంటనే ప్రత్యేక తనిఖీలు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## రంగారెడ్డిలో భారీగా పెరగనున్న..

# ఎంపీ స్థానాలు

హైదరాబాద్, : లోక్‌సభ స్థానాల సంఖ్యను ప్రస్తుతమున్న 550 నుంచి 850కి పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇందుకోసం రాజ్యాంగంలోని ఆర్టికల్ 81కి సవరణలు చేయనున్నారు. ఈ పునర్విభజన వల్ల తెలంగాణలో లోక్‌సభ స్థానాల సంఖ్య 17 నుంచి 26 లేదా 27కు పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా జనాభా అధికంగా ఉన్న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొత్త ఎంపీ స్థానాలు ఏర్పడనున్నాయి. 33 శాతం మహిళా రిజర్వేషన్ల అమలుతో.. వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణ నుంచి కనీసం 9 మంది మహిళలు లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించనున్నారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో చారిత్రాత్మక మార్పునకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే సంకల్పంతో పాటు, పెరిగిన జనాభాకు అనుగుణంగా ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు లోక్‌సభ స్థానాల సంఖ్యను భారీగా పెంచాలని నిర్ణయించింది. ప్రస్తుతం లోక్‌సభ గరిష్ఠ సభ్యుల సంఖ్య 550 ఉండగా.. 2011 జనాభా లెక్కల ప్రకారం.. ఆ సంఖ్యను 850కి పెంచేలా ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందులో రాష్ట్రాల వాటా 815 కాగా.. కేంద్ర పాలిత ప్రాంతాలకు 35 స్థానాలను కేటాయించనున్నారు. ఈ పునర్విభజన బిల్లు ప్రక్రియ వల్ల తెలంగాణ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలు ఉండగా.. కొత్త లెక్కల ప్రకారం ఇవి 26 లేదా 27కు పెరిగే అవకాశముంది. అసెంబ్లీ స్థానాలు ప్రస్తుతం 119 ఉండగా.. అదనంగా 60 సీట్లతో 179కి చేరే అవకాశం ఉంది. 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుంటే.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా జనాభా పరంగా దేశంలోనే 17వ స్థానంలో ఉంది. ఫలితంగా గ్రేటర్ హైదరాబాద్, దాని చుట్టుపక్కల ప్రాంతాల్లోనే అదనంగా 3 నుంచి 4 కొత్త లోక్‌సభ స్థానాలు ఏర్పడనున్నాయి. దేశంలోనే అతిపెద్ద నియోజకవర్గంగా ఉన్న మల్కాజిగిరితో పాటు సికింద్రాబాద్, హైదరాబాద్, భువనగిరి స్థానాలను విభజించి కొత్త నియోజకవర్గాలను ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాలను విభజించి అదనంగా మరో రెండు స్థానాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. ప్రస్తుతమున్న మెదక్, జహీరాబాద్‌లకు తోడు మరొక కొత్త స్థానం రానుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ విభజన ద్వారా అదనంగా ఒక స్థానం ఏర్పడనుంది. ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో ఒకటి లేదా రెండు కొత్త స్థానాలు వచ్చే సూచనలున్నాయి. ప్రస్తుతం తెలంగాణ నుంచి లోక్‌సభలో ఇద్దరు మహిళలు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే 33 శాతం రిజర్వేషన్లు అమల్లోకి వస్తే.. 2029 ఎన్నికల నాటికి ఈ సంఖ్య కనీసం 9కి చేరనుంది. గత ఎన్నికల్లో ప్రధాన పార్టీలు మహిళలకు తక్కువ టికెట్లు కేటాయించినప్పటికీ.. భవిష్యత్తులో ప్రతి పార్టీ కచ్చితంగా 9 మంది మహిళా అభ్యర్థులను బరిలోకి దించాల్సి ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఖమ్మం, కరీంనగర్ వంటి జిల్లాల్లో మహిళా ఓటర్లు అధికంగా ఉండటం విశేషం. కాగా, ఈ పునర్విభజన ప్రక్రియ 2026-27 నాటి జనాభా లెక్కల ఆధారంగా జరిగే అవకాశం ఉందని.. అప్పటికి నియోజకవర్గాల సరిహద్దులు మారిపోయి సరికొత్త రాజకీయ సమీకరణాలు తెరపైకి వస్తాయని పొలిటికల్ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మార్పులు మహిళల గొంతు పార్లమెంటులో మరింత బలంగా వినిపించడానికి దోహదపడతాయని అంటున్నారు.

## ఇంటర్ ఫలితాల్లో మెరుగైన ప్రతిభ... జిల్లా కలెక్టర్‌కు అధికారుల అభినందన



నిర్మల్, ఏప్రిల్:15(తెలంగాణ వాణి ప్రతినిధి): ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాలలో నిర్మల్ జిల్లా విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనబరచడంతో, పలువురు అధికారులు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవను మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి పూల మొక్కలను అందజేశారు. విద్యార్థులు మంచి ఫలితాలు సాధించేందుకు ప్రోత్సాహం అందించినందుకు కలెక్టర్‌కు అధికారులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఇంటర్ పరీక్షలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంలో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమిష్టి కృషి ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ ఫలితాలు అందరి కృషి ఫలితమని, రానున్న రోజుల్లో మరింత కష్టపడి జిల్లాను విద్యారంగంలో ముందువరుసలో నిలపాలని సూచించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి పరుశురాం, అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

# త్రిభాషా విధానం ఐచ్ఛికమా? అనివార్యమా?



భారతదేశం అనేక భాషల సమాహారం. ప్రతి మట్టిలో ఒక మాట, ప్రతి ఊరిలో ఒక స్వరం. ఈ భాషా వైవిధ్యాన్ని ఒకే విద్యావిధానంలో కూర్చోబెట్టాలని చేసిన ప్రయత్నమే త్రిభాషా విధానం. కానీ ఈ విధానం నిజంగా భాషలకు వంతెనగా మారనుందా? లేక అడ్డంకిగా నిలుస్తుందా? అనే ప్రశ్న ఇప్పుడు ఎంతో ప్రాధాన్యం సంతరించుకున్నది. సీబీఎస్ఈ 6వ తరగతి నుంచే తప్పనిసరి త్రిభాషా విధానాన్ని ఇటీవలే ప్రవేశపెట్టింది. ఈ విధానం ప్రకారం విద్యార్థులు కనీసం రెండు భారతీయ భాషలను నేర్చుకోవాలి. 2031 నాటికి 10వ తరగతి వరకు ఈ విధానం పూర్తిగా అమల్లోకి వస్తుంది.

దేశంలో త్రిభాషా విధానం కేవలం విద్యావిధానం మాత్రమే కాదు, భాష, సంస్కృతి, రాజకీయాల కలయికలో ఉన్న సున్నితమైన అంశం. సెంట్రల్ బోర్డ్ త్రిభాషా వైఖరి భారతీయ భాషలకు అనుకూలమా? లేక అడ్డంకా? అనే ప్రశ్నకు ఒకే సమాధానం లభించదు. దానిని రెండువైపులా పరిశీలించాల్సిందే. త్రిభాషా విధానం అంటే సాధారణంగా మాతృభాష/ప్రాంతీయ భాష, హిందీ లేదా ఇతర భారతీయ భాష, ఇంగ్లీష్ లేదా మరో విదేశీ భాష. భాష అనేది కేవలం మాటల సమాహారం కాదు. అది మనసు, మట్టి, మనుగడ. వాటి నడుమ త్రిభాషా విధానం ఒక వంతెన కావచ్చు, కానీ అది బలవంతపు వంతెనగా మారితే, సంస్కృతుల మధ్య దూరం పెరుగుతుంది. మాతృభాషలో పుట్టిన ఆలోచనకు రెక్కలు ఉంటాయి. ఆ రెక్కలను కత్తిరించకుండా, ఇతర భాషల గాలిని అనుభవించే స్వేచ్ఛ ఇవ్వడమే నిజమైన విద్యావిధానం. త్రిభాషా విధానం ఉద్దేశం చూస్తే అది ఆకర్షణీయంగానే ఉన్నది.

విద్యార్థి తన మాతృభాషలో నేర్చుకోవాలి, మరో భారతీయ భాషను అర్థం చేసుకోవాలి, ప్రపంచంతో సంభాషించడానికి ఇంగ్లీష్ నేర్చుకోవాలి. ఇది సిద్ధాంతంగా సరైన దారే. భాషల మధ్య సంభాషణ పెరగాలి, సంస్కృతులు దగ్గర కావాలి, జాతీయ ఐక్యత బలపడాలి అనే ఆశయం దీనిలో దాగి ఉన్నట్టుగా కనిపిస్తుంది. కానీ ఆచరణలోకి వచ్చినప్పుడు మొత్తం దృశ్యమే మారిపోతుంది. మూడు భాషలు విద్యార్థి భుజాలపై బలవంతంగా మోపిన భారంలా మారుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ పాఠశాలల్లో, మౌలిక వసతులు తక్కువగా ఉన్నచోట్ల, ఇది విద్యపై ఆసక్తిని పెంచకుండా తగ్గిస్తున్నది. భాషలు నేర్చుకోవడం ఎవరికైనా ఆనందంగా ఉండాలి, కానీ అది బాధ్యతగా, పరీక్షల ఒత్తిడిగా మారితే, విద్యార్థి మనసు భారమవుతుంది.

మరొక ప్రధాన అభ్యంతరం..హిందీ ప్రాబల్యం. దక్షిణ భారతదేశంలో త్రిభాషా విధానం అనేది హిందీని తప్పనిసరి చేయడంగా అనిపిస్తున్నది. అదే సందర్భంలో ఉత్తర భారతదేశంలో దక్షిణ భాషలు నేర్చుకోవడం పట్ల అలాంటి కట్టుబాటు కనిపించదు. ఈ అసమానత భాషా న్యాయంపై ప్రశ్నలు లేవనెత్తుతున్నది. నిజానికి భాషా విధానం ఒక ప్రాంతానికి అనుకూలంగా, మరో ప్రాంతానికి భారంగా మారకూడదు. అలాగని ఈ విధానాన్ని పూర్తిగా వ్యతిరేకించడం కూడా సరైంది కాదు. ఎందుకంటే భాషల మధ్య పరిచయం అవసరం. ఒక తెలుగు విద్యార్థి హిందీ లేదా మరొక భారతీయ భాష నేర్చుకోవడం వల్ల దేశవ్యాప్తంగా అవకాశాలు విస్తరిస్తాయి. అదేవిధంగా ఉత్తర భారతదేశ విద్యార్థి తెలుగు లేదా తమిళం నేర్చుకుంటే, నిజమైన సాంస్కృతిక మార్పిడి జరుగుతుంది. అందుకే సమస్య విధానంలో కాదు, అమలులోనే ఉన్నది. మాతృభాషకు నిజమైన ప్రాధాన్యం ఇవ్వకుండా, ఇతర భాషలను బలవంతంగా రుద్దడం అనేదే సమస్య.

అది ప్రాంతాల మధ్య ఆధిపత్యం పెరగడానికి దారితీస్తుంది. భాష మన ఆత్మ. ఆ ఆత్మను గౌరవించే విధానం ఏదైనా సమర్థనీయమే. గౌరవించని విధానం ఎంత మంచిదైనా, అది అడ్డంకిగానే మిగులుతుంది. త్రిభాషా విధానం ఉద్దేశం చూస్తే అది సమతుల్యమైనదే. మాతృభాషలో విద్య పునాది, దేశవ్యాప్త అనుసంధానం కోసం ఒక భారతీయ భాష, అంతర్జాతీయ అవకాశాల కోసం ఆంగ్లం ఈ మూడు కోణాలను కలిపే ప్రయత్నమే ఇది. ఈ ఆలోచనలో లోపం లేదు. కానీ అమలులోనే సమస్యలు. ముఖ్యంగా, హిందీకి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనే భావన ఇతర అన్ని భాషల ప్రజల్లో అసంతృప్తిని పెంచుతున్నది. తమిళనాడు దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. అక్కడ భాషా ఉద్యమాలు కేవలం రాజకీయ ప్రతిస్పందనలు కావు. అవి అస్తిత్వ పోరాటాలు. భాష అంటే ‘మనం’ అనే భావనతో హిందీని బలవంతంగా రుద్దడాన్ని తమిళ సమాజం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నది. అందుకే అక్కడ రెండు భాషల విధానం తమిళం, ఆంగ్లం స్థిరపడింది. అది ఒక ప్రతిఘటన మాత్రమే కాదు, తమిళ గౌరవానికి ప్రతీక. మరి తెలుగు రాష్ట్రాలు ఏ దారిని ఎంచుకోవాలి? తెలుగు సమాజం చరిత్రపరంగా విస్తృతమైన భాషా అనుభవం కలిగి ఉన్నది. ఉర్దూ, ఆంగ్లం, హిందీ ఇవన్నీ మన జీవితంలో భాగమయ్యాయి. కనుక హిందీని పూర్తిగా వ్యతిరేకించడం అవసరమా? అదే సమయంలో హిందీకి ‘ప్రాధాన్యత’ అనే పేరుతో తెలుగు స్థానాన్ని తగ్గించడాన్ని కూడా అంగీకరించలేం.

హిందీ ఒక పెద్ద భాష. ఉద్యోగావకాశాలు, ఇతర రాష్ట్రాలతో సంబంధాలు.. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుంటే దానిని నేర్చుకోవడం ప్రయోజనకరం. కానీ అది ఐచ్ఛికం కావాలి, అనివార్యం కాదు. ప్రాధాన్యత అనే పదం, ఇతర భాషలను పక్కనబెట్టే ప్రమాదాన్ని కలిగిస్తుంది. అది సమానత్వాన్ని కాదు, ఆధిపత్యాన్ని సూచిస్తుంది. తెలుగు రాష్ట్రాల ముందు ఉన్న నిజమైన సవాల్ ఇదే. సమతుల్యతను ఎలా కాపాడాలి? మొదటగా, విద్యావ్యవస్థలో తెలుగు భాషకు అగ్రస్థానం ఉండాలి. దీంతో మాతృభాషలోనే బలమైన పునాది ఏర్పడుతుంది. ఆ తర్వాత ఆంగ్లం ప్రపంచంతో కలిపే వేదికగా. మూడోదిగా హిందీ లేదా ఇతర భాషలు విద్యార్థి ఆసక్తి, అవసరాల మేరకు నేర్చుకునేలా ఉండాలి. ఇదే సమతుల్య దారి. అవసరమైతే, తమిళనాడు చూపించిన దారిలో గట్టిగా నిలబడాలి. అది వ్యతిరేకత కోసం కాదు, స్వాభిమానం కోసం. కానీ ప్రతి సందర్భంలో ప్రతిఘటన అవసరం లేదు. చైతన్యంతో కూడిన నిర్ణయం అవసరం. భాషను ప్రేమించడం అంటే ఇతర భాషలను ద్వేషించడం కాదు. అదే సమయంలో, మన భాష విలువను తగ్గించడాన్ని మౌనంగా చూడడం కూడా కాదు. మాతృభాషపై మమకారం, ఇతర భాషల పట్ల అవగాహన ఈ రెండూ కలిస్తే నిజమైన భారతీయ బహుభాషా ఆత్మ. తెలుగు రాష్ట్రాలు ఈ సూత్రాన్ని గౌరవిస్తే, త్రిభాషా విధానం ఒక వివాదంగా కాకుండా, ఒక అవకాశంగా మారుతుంది.

## ట్రాఫిక్ నియమాలు పాటిస్తు సురక్షితంగా ప్రయాణించండి

### జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ నందిగామలో “అరైవ్ అలైవ్” రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం




పటాన్ చెరు (తెలంగాణ వాణి రిపోర్టర్): ట్రాఫిక్ నియమాలు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న “అరైవ్ అలైవ్” రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం మూడవ రోజు నందిగామ గ్రామంలోని ఎస్.ఎన్. ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను తగ్గించాలంటే ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించి పరిమిత వేగంతో ప్రయాణించాలని తెలిపారు. అతివేగం క్షణిక ఆనందాన్ని ఇచ్చినప్పటికీ ప్రాణ నష్టానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గమ్యస్థానాన్ని చేరుకోవడం ఎంత ముఖ్యమో, సురక్షితంగా చేరుకోవడం అంతకంటే ముఖ్యమని ఆయన పేర్కొన్నారు.యువతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, హెల్మెట్ ధరించకుండా ప్రయాణించడం ప్రమాదాలకు ప్రధాన కారణమవుతోందన్నారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ వినియోగా న్ని పూర్తిగా నివారించాలని సూచించారు. ఈ సందర్భంగా యువతకు ఐఎస్ఐ గుర్తింపు పొందిన హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు డీఎస్పీ ప్రభాకర్, భానూర్ ఇన్స్పెక్టర్ విజయకృష్ణ, స్థానిక ప్రజా ప్రతినిధులు, డ్వాక్రా సంఘాల మహిళలు, పరిశ్రమల ఉద్యోగులు, ఆటో డ్రైవర్లు మరియు యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వైసీపీ ప్రధాన కార్యదర్శి శ్రీహరి అరెస్ట్ అరాచకం

### పోలీసులపై సజ్జల ఫైర్

అమరావతి,: వైసీపీ ప్రధాన కార్యదర్శి శ్రీహరి అరెస్ట్ అరాచకమని పోలీసులపై ఆ పార్టీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి ఫైర్ అయ్యారు. చంద్రబాబుపై అసత్య వార్తల ప్రచారంపై శ్రీహరిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అయితే ఈ అరెస్ట్‌పై స్పందించిన సజ్జల ప్రభుత్వం, పోలీసులపై మండిపడ్డారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా శ్రీహరి అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫస్ట్ అరెస్ట్ చేసి ఆ తర్వాత సోదాలు అంటున్నారని ధ్వజమెత్తారు. శ్రీహరిని భయభ్రాంతులకు గురి చేసే ప్రయత్నం చేశారని ఆరోపించారు. పోలీసులు పూర్తిగా పాలకులకు వంతపాడుతున్నారని వ్యాఖ్యానించారు. పోలీసులు నిబంధనలు పాటించడంలేదని, కనీసం ఎఫ్ఐఆర్ కాపీలు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. శ్రీహరి గతంలో జర్నలిస్టుగా పని చేశారని, ఆయన ఉగ్రవాది కాదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కీలక నేతగా ఉన్న శ్రీహరిని అలా అరెస్ట్ చేస్తారా అని సజ్జల రామకృష్ణారెడ్డి ప్రశ్నించారు.

# మహిళా బిల్లుకు కౌంట్ డౌన్..



న్యూఢిల్లీ, : పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ల చట్టసవరణ బిల్లుకు కౌంట్‌డౌన్ ప్రారంభమయ్యింది. ఈ చట్ట సవరణ బిల్లును కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. “నారీ శక్తి వందన్ అధినియం పేరుతో మహిళా రిజర్వేషన్ల చట్ట సవరణలపై చర్చించేందుకు వీలుగా ఈ నెల 16 నుంచి 18 వరకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించేందుకు కూడా నడుం బిగించింది. దీంతో బడ్జెట్ సమావేశాల కాలాన్ని కూడా పొడిగించింది. దీనిని బట్టి చూస్తే ఈ బిల్లు విషయంలో ఎన్డీయే ప్రభుత్వం గట్టి పట్టుదలతో వుందని అర్థమైపోతుంది.ఇక? ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ అత్యంత కీలక అడుగు వేశారు. ‘మహిళా రిజర్వేషన్ల చట్టం’ అమలులో మద్దతును కోరుతూ ప్రధాని మోదీ లోక్ సభ, రాజ్యసభలోని అన్ని పార్టీల సభా నాయకులకు లేఖ రాశారు.ఏప్రిల్ 16 నుంచి నారీశక్తి వందన్ అధినియం” కి సంబంధించిన చారిత్రాత్మకమైన చర్చ పార్లమెంట్ లో జరగనుంది. ఈ ప్రత్యేక సమావేశం ద్వారా మన దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి ఓ సువర్ణావకాశం. అందరినీ కలుపుకుంటూ, సమిష్టిగా ముందుకు సాగాలన్న మన సంకల్పాన్ని పునరుద్ఘాటించే సందర్భం కూడా ఇదే. ఈ స్ఫూర్తి, ఉద్దేశంతోనే నేను మీకు లేఖ రాస్తున్నాను. ఈ చట్టం ఉద్దేశం, స్ఫూర్తి ఈ రెండింటిని పరిగణనలోకి తీసుకొని, ఈ బిల్లు సంపూర్ణంగా అమలులోకి రావాల్సిన సమయం ఆసన్నమైంది” అంటూ మోదీ ఆ లేఖలో వివరించారు.అంతేకాకండా 2029 లోకసభ ఎన్నికలు, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ల చట్టం అమలు కావడం అత్యంత అవసరమని ప్రధాని నొక్కి చెప్పారు. విస్తృతమైన సంప్రదింపుల తర్వాత, దేశ వ్యాప్తంగా నారీశక్తి వందన్ అధినియం అమలు చేయడానికి తగిన సమయం ఆసన్నమైందని తాము ఓ నిర్ణయానికి వచ్చామని ప్రధాని ఆ లేఖలో పేర్కొన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికలు మరియు శాసనసభ ఎన్నికలు మహిళా రిజర్వేషన్ల అమలుతోనే నిర్వహించడం అత్యంత ఆవశ్యకమని వివరించారు. ఈ బిల్లు ప్రజాస్వామ్య సంస్థలకుకొత్త శక్తిని అందిస్తుందని, ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరుస్తుందన్నారు. తాము చేస్తున్న ఈ ప్రయత్నం పక్షపాత రాజకీయాలకు అతీతమైందని, ఓ ముందడుగు అని ప్రధాని అభివర్ణించారు. మహిళల కలలను సాకారంచే దిశగా ఓ ప్రయత్నమని అభివర్ణించారు. ఉభయ సభల పార్లమెంట్ సభ్యులు ఈ ప్రతిపాదనకు, బిల్లుకు ఏకగ్రీవంగా మద్దతు ఇవ్వాలని ప్రధాని అన్ని పక్షాలను కోరారు.ఈ సవరణను ఆమోదించడానికి మనమందరం ఏకతాటిపైకి రావాలనే ఉద్దేశంతో నేను ఈ లేఖను రాస్తున్నానని, ఈ విషయంపై పార్లమెంటులో అనేకమంది పార్లమెంటు సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తే ఎంతో బాగుంటుంది మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇది ఏ ఒక్క పార్టీకో లేదా ఏ ఒక్క వ్యక్తికో సంబంధించింది కాదని, వీటన్నింటికీ అతీతమైన సందర్భం అని మోదీ అభిప్రాయపడ్డారు.మహిళల పట్ల, అలాగే మన భవిష్యత్ తరాల పట్ల బాధ్యతను చాటిచెప్పాల్సిన సమయం ఇది. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యాన్ని పెంచాలనే ఆకాంక్షను అన్ని రాజకీయ పార్టీలూ ఎంతో కాలంగా వ్యక్తం చేస్తున్నందున, ఆ ఆశయాన్ని సాకారం చేయడానికి ఇదే సరైన సమయం,” అని ప్రధాని వివరించారు.దేశ రాజకీయాల్లో మహిళల పాత్ర పెంచడానికి రూపొందించినదే ఈ ‘మహిళా రిజర్వేషన్ బిల్లు’. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం లోక్‌సభలో 542 సీట్లకు గాను.. 78 మంది మహిళా ఎంపీలుంటే.. రాజ్యసభలో 224 సీట్లలో 24 మంది మహిళలున్నారు. ఉభయసభల్లో మొత్తం 102 మంది మహిళా ఎంపీలున్నారు. ఈ లెక్కన చూస్తే.. పార్లమెంట్‌లో 13.3 శాతం మాత్రమే మహిళలున్నారు. ఈ సంఖ్యను 33 శాతానికి పెంచాలనే ఉద్దేశంతో దీనిని రూపొందించారు.ఈ ఆలోచనకు దాదాపు 27 ఏళ్ల క్రితమే అంకురార్పణ జరిగింది. 1996లో హెచ్‌డీ దేవెగౌడ సారథ్యంలోని యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం తొలుత లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టింది. తర్వాత వాజ్‌పేయీ, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల హయాంలోనూ ప్రవేశపెట్టినా ఈ బిల్లు ఆమోదానికి నోచుకోలేదు. చివరకు 2010లో రాజ్యసభ ఆమోదం పొందినా లోక్‌సభలో మాత్రం పెండింగ్‌లోనే ఉండిపోయింది.ఆపై 2014లో లోక్‌సభ రద్దు కావడంతో మరోసారి బిల్లు అడుగున పడిపోయింది. మరలా తొమ్మిదేళ్ల అనంతరం తాజాగా మరోసారి ఈ బిల్లు తెరమీదకొచ్చింది.

# నగరంలో హీట్ ఐలాండ్ ఎఫెక్ట్

హైదరాబాద్, : తెలంగాణ ప్రజలకు వాతావరణశాఖ అధికారులు అలర్ట్ జారీ చేశారు. రాష్ట్రంలో తీవ్రమైన వడగాల్పులు వీస్తాయని హెచ్చరించారు. ఆదిలాబాద్, నల్గొండ, సూర్యాపేటతో పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 42 నుంచి 45 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే ఛాన్స్ ఉందని జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. హైదరాబాద్ నగరంలోనూ 42 డిగ్రీల వరకు ఎండ తీవ్రత ఉండనుందని చెబుతున్నారు. మధ్యాహ్నం సమయంలో ప్రయాణాలు తగ్గించుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.తెలంగాణలో భానుడు భగ్గుమంటున్నాడు. చాలా ప్రాంతాల్లో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 8 తర్వాత కాలు బయట పెట్టాలంటే భయపడాల్సిన పరిస్థితి. ఉదయం 10 తర్వాత రాష్ట్రంలోని చాలా పట్టణాల్లో రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. తీవ్ర ఎండలతో పాటు భరించలేని ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వేసవి కాలం గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో రానున్న వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా టార్చర్ హీట్‌వేవ్ కొనసాగుతుందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీలు అదనంగా నమోదవుతుండగా.. రానున్న వారం రోజులు మునుపెన్నడూ లేని విధంగా గరిష్ఠ స్థాయికి ఉష్ణోగ్రతలు చేరుకుంటాయని తెలంగాణ వెదర్ మ్యాన్ హెచ్చరిస్తున్నారు.ముఖ్యంగా ఉత్తర తెలంగాణ, సరిహద్దు జిల్లాలైన ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. అలాగే దక్షిణ తెలంగాణ జిల్లాలు నల్గొండ, సూర్యాపేట, గద్వాల జిల్లాల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని అంటున్నారు. ఈ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 42 నుంచి 45 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే ఛాన్స్ ఉందని హెచ్చరిస్తున్నారు. ఆయా జిల్లాల్లో మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు రావటం మంచిది కాదని చెబుతున్నారు. హీట్ వేవ్స్ తీవ్రత కారణంగా శరీర ఉష్ణోగ్రతను అకస్మాత్తుగా పెరిగే ప్రమాదం ఉందని జాగ్రత్తగా ఉండాలని



అంటున్నారు.హైదరాబాద్‌లో కూడా పరిస్థితి ఆందోళనకరంగానే ఉందని చెబుతున్నారు. కాంక్రీట్ భవనాలు, వాహనాల రద్దీ వల్ల నగరంలో హీట్ ఐలాండ్ ఎఫెక్ట్ కనిపిస్తోందని అంటున్నారు. వచ్చే వారం రోజుల పాటు నగరంలో వరుసగా 40 నుంచి 42 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా వేస్తున్నారు. నగరవాసులు తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప మధ్యాహ్నం వేళ బయటకు రావొద్దని వాతావరణ శాఖ సూచించింది. ఇతర జిల్లాల్లో కూడా సగటు ఉష్ణోగ్రతలు 41 నుంచి 43 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదవుతాయని హెచ్చరిస్తున్నారు.

ఈ జాగ్రత్తలు తీసుకోండి..: తీవ్రమైన ఎండల దృష్ట్యా తెలంగాణ ఆరోగ్య శాఖ ప్రజలకు పలు సూచనలు జారీ చేసింది. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకుఅత్యవసరమైతే తప్ప బయటకు వెళ్లొద్దు. బయటకు వెళితే.. గొడుగు లేదా టోపీ వంటివి ధరించాలి. దాహం లేకపోయినా క్రమం తప్పకుండా నీరు తాగుతూ ఉండాలి. మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం వంటి లిక్విడ్ పదార్థాలు శరీరంలో డీహైడ్రేషన్ రాకుండా కాపాడతాయి. లేత రంగు కాటన్ దుస్తులు ధరించడం వల్ల శరీరానికి గాలి తగిలి వేడి తగ్గుతుంది. నూనెలో వేయించిన పదార్థాలు, మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారానికి దూరంగా ఉండాలి. అధిక ప్రోటీన్ ఉండే ఆహారం జీర్ణం కావడానికి ఎక్కువ ఉష్ణాన్ని ఉత్పత్తి చేస్తుంది, కాబట్టి జాగ్రత్తగా ఉండాలి. చిన్నపిల్లలు, గర్భిణీలు, వృద్ధులు ఎండల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలి. అస్వస్థతగా అనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

## డా.వేల్పుల శంకర్ కు దళిత రత్న అవార్డు



కోహెడ (తెలంగాణ వాణి విలేకరి) : సిద్దిపేట జిల్లా కోహెడ మండల కేంద్రానికి చెందిన డా వేల్పుల శంకర్ సామాజిక కార్యకర్తగా దళిత హక్కులు, ఆత్మగౌరవం కోసం కొనసాగిస్తున్న పోరాటానికి గుర్తింపుగా దళిత రత్న అవార్డు అందుకున్నారు. కొన్ని సంవత్సరాలుగా దళిత బీసీఎస్సీ ఎస్టీ, మైనార్టీ హక్కుల కోసం అలాగే పేదల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నారు. ఆయన సేవలను కృషిని గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డుతో సత్కరించింది. అవార్డును డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ ఇటుక రాజు హైదరాబాద్ రవీంద్ర భారతిలో వేల్పుల శంకర్ కు అందించారు. అవార్డు శంకర్ పోరాటానికి ఒక గుర్తింపు అని పలువురు ఎస్సీ, ఎస్టీ,బీసీ,మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అంబేద్కర్ ఉత్సవాల కమిటీ చైర్మన్ఇటుకరాజు, తెలంగాణమాదిగ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు జున్ను కనకరాజు, తెలంగాణ మాదిగ పోరాట సమితి ఎలక్ట్రానిక్ కన్వీనర్ ఇటుక గోపి, కంటోన్మెంట్ సీనియర్ దళిత నాయకులు పొన్నాల బాబు, వేల్పుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలి

### రవాణా శాఖ ఆధ్వర్యంలో సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా అరైవ్-అలైవ్ కార్యక్రమం

కొత్తగూడెం (తెలంగాణ వాణి) రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆర్టీవో వెంకటరమణ జెండా ఊపి ప్రారంభించారు. ప్రకాశం స్టేడియం నుండి ఓల్డ్ డిపో వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో పోలీస్ శాఖ, సిక్స్త్ బెటాలియన్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్టీవో వెంకటరమణ మాట్లాడుతు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ‘ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక’లో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఏప్రిల్ 13 నుంచి 18 వరకు “అరైవ్ అలైవ్” రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బైక్ నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రిబుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్ చేయకూడదని వాహనదారులకు సూచించారు. ప్రతి ఒక్కరూ కచ్చితంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. కార్ డ్రైవింగ్ చేసే వారు సీట్ బెల్ట్ ధరించాలని, ఆటోలలో అధిక లోడ్‌తో ప్రయాణికులను ఎక్కించకూడదని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని సూచించారు. ఈ నెల 18 వరకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంవిఐ మనోహర్, సీఐ కరుణాకర్, ట్రాఫిక్ ఎస్సై ప్రవీణ్ కుమార్, 6వ బెటాలియన్ డీఎస్పీ శంకర్ నాయక్, శ్రీనివాసరెడ్డి ఆర్ ఎస్ఐ సురేష్ ప్రవీణ్ కుమార్ , గోపాల్ పాపన్న, రాంబాబు, యుగంధర్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

# మాస్టర్ ప్లాన్ మార్చేందుకు ఎప్పుడో ప్రయత్నం చేశాం!



కొత్తగూడెం (తెలంగాణ వాణి): జిల్లా కేంద్రమైన కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలో మాస్టర్ ప్లాన్ మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఈమేరకు గతంలో మున్సిపల్ సమావేశంలో చర్చించేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయాన్ని ధ్రువీకరిస్తు ఆనాటి సమావేశంలో కొంతమంది కౌన్సిలర్లు అడ్డుపడటం వల్లేనే ఆ ప్రయత్నం ఆగిపోయినట్లు మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి తన అభిప్రాయాన్ని "తెలంగాణ వాణి" ప్రతినిధితో మాట్లాడుతూ చెప్పారు.

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడక ముందు కొత్తగూడెం పట్టణంలోని 142, 143 సర్వే నెంబర్ల పరిధిలో పేర్కొనబడిన ముఖ్య ప్రాంతాలలో వాణిజ్య సముదాయాలకు సైతం గృహసముదాయాల క్రింద పన్నులు వసూలు చెల్లించబడుతున్నందున అట్టి వాటిని వ్యాపార సముదాయాలుగా మార్పు చేసి కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని తన అభిప్రాయాన్ని ఆమె వెల్లడించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాడకముందు కొత్తగూడెం మున్సిపాల్టీ పరిధిలో 1975 నాటి మాస్టర్ ప్లాన్ను రద్దు చేసి మున్సిపల్ ఆదాయాన్ని పెంచేందుకుగాను కౌన్సిల్ సమావేశంలో చర్చ జరిగింది. కానీ ప్రస్తుతం మున్సిపాలీటీ నుండి మున్సిపల్ కార్పొరేషన్గా ఏర్పడినప్పటికి పట్టణంలోని సర్వే నెం. 142, 143 పరిధిలోని ముఖ్య ప్రాంతాలలో గృహసముదాయముల పేరుతోనే వ్యాపారం సముదాయములు నిర్వహించబడుచున్నాయని అసలు నిజాన్ని వెల్లడించారు. దీని వల్ల ఆదాయానికి గండిపడటమే కాకుండా మున్సిపల్ కార్పొరేషన్ అభివృద్ధికి అండంకులు ఏర్పడుతోందని పేర్కొన్నారు. కావున ఈ దిగువ పేర్కొనబడిన ప్రాంతాలలోని ఉన్నటువంటి గృహములను వ్యాపారసముదాయల పరిధిలోనికి తీసుకువచ్చి కార్పొరేషన్ అభివృద్ధితో పాటు ఆదాయం పెంచే విధంగా చూడవలసినదిగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే కార్పొరేషన్ పరిధిలో కొన్ని ముఖ్య ప్రాంతాలుగా ఉన్న సింగరేణి హెడ్ ఆఫీసు సెంటర్ నుండి పోస్టాఫీస్ సెంటర్, మెయిన్ రోడ్డుకు ఇరువైపుల గల బిల్డింగ్ ను వ్యాపార సముదాయాలుగా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పోస్టాఫీస్ సెంటర్ నుండి సిఈఆర్ క్లబ్ వరకు రోడ్డు సైడున గల బిల్డింగ్ ను వ్యాపార సముదాయాలుగా మార్చాలన్నారు. పోస్టాఫీస్ సెంటర్ నుండి బస్టాండ్ సెంటర్, సూపర్ బజార్ సెంటర్, మొర్రేడు బ్రిడ్జి వరకు మెయిన్ రోడ్డుకు ఇరువైపుల ఉన్నటువంటి బిల్డింగ్లను వ్యాపార సముదాయాలుగా మారిస్తేనే కార్పొరేషన్ కు ఆదాయం పెరుగుతుందన్నారు.

గణేష్ టెంపుల్ లైన్ నుండి మేదరబస్తి వరకు గల రోడ్డుకు ఇరువైపుల ఉన్న ప్రాంతాలను, బిల్డింగ్లను వ్యాపార సముదాయాలుగా మార్చాల్సిన అవసరం ఉంది అన్నారు. సూపర్ బజార్ సెంటర్ నుండి మెయిన్ హాస్పిటల్ సెంటర్, మెయిన్ హాస్పిటల్ సెంటర్ నుండి ఫైర్ స్టేషన్ వరకు ఉన్న ప్రాంతాలను కూడా వ్యాపార సముదాయాలుగా మార్చాల్సిందేనన్నారు. సూపర్ బజార్ సెంటర్ నుండి కిరోసిన్ బంక్ వరకు రోడ్డు సైడున ఉన్నటువంటి ప్రాంతాలలోని బిల్డింగ్ లను వ్యాపార సముదాయాలుగా మారిస్తేనే కార్పొరేషన్ ఆదాయం పెరగడంతో పాటు ఆయా ప్రాంతాల్లోని స్థలాలకు విలువలు పెరుగుతాయన్నారు. అంతేకాకుండా ఆయా ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టుకునే వారికి బ్యాంకు రుణాలతో పాటు ఎలాంటి వివాదాలు లేకుండా కార్పొరేషన్ ద్వారా అనుమతులు లభించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు.

**కొందరు అడ్డుపడటంతో అది ఆగింది**
**ముఖ్యమైన ప్రాంతాలను వాణిజ్య ప్రాంతాలుగా మారిస్తేనే ఆదాయం పెరుగుతుంది**
**1975 నాటి మాస్టర్ ప్లాన్ రద్దుచేసేందుకు మున్సిపల్ సమావేశంలో చర్చ జరిగింది**
**ప్రధాన ప్రాంతాల్లో 500 మీటర్లు సెట్ బ్యాక్ తీస్తేనే ఆదాయం వస్తుంది**
**అభిప్రాయాన్ని వ్యక్తం చేసిన మున్సిపల్ మాజీ చైర్పర్సన్ కాపు సీతాలక్ష్మి**

# భూ భారతి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

## తహసీల్దార్ కార్యాలయం ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్



రాయికల్: ఏప్రిల్ 15 (తెలంగాణ వాణి): జగిత్యాల జిల్లా రాయికల్ మండలం తహసిల్దార్ కార్యాలయంను జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బి.ఎస్ లత ఆకస్మిక తనిఖీ చేశారు. భూ భారతికి సంబంధించిన పెండింగ్ అంశాలు, ఓటరు జాబితా సవరణ మరియు సాధాబైనామ కు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్బంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలపై ప్రతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. మరియు మీసేవ సర్టిఫికెట్లను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సర్టిఫికెట్ల ప్రజలకు అందించవలసిందిగా అధికారులకు ఆదేశించారు. జనగణన-2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన విధులు అధికారులు, సిబ్బంది సమన్వయంతో సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. జనగణనకు ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లను నియమించడం జరుగుతుందని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా మొదటి విడత ఇండ్ల గణన ప్రక్రియను పూర్తి చేయాలని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించాలని చెప్పారు. నివేదికలను సమయానికి సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో రాయికల్ తహసీల్దార్ నాగార్జున, రెవెన్యూ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

# రహదారి భద్రత - అందరి బాధ్యత: మంత్రి పొన్నం ప్రభాకర్

## ఆదిలాబాద్‌లో ఘనంగా రహదారి భద్రత అవగాహన కార్యక్రమం






ఆదిలాబాద్, ఏప్రిల్ : 15 ( తెలంగాణ వాణి ప్రతినిధి ): రహదారి నిబంధనలు పాటించడం కేవలం చట్టం కోసం కాదని, అది మన ప్రాణాలకు రక్షణ కవచమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలనా-ప్రగతి ప్రణాళిక లో భాగంగా నిర్వహించిన అరైవ్ అలైవ్, రహదారి భద్రత అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలపై సమాజంలో అవగాహనా పెంపొందించడంలో విద్యార్థుల పాత్ర కీలకమని అన్నారు. దేశంలో సహజ మరణాల కంటే, రోడ్డు ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోతున్న వారే ఎక్కువగా ఉండటం అత్యంత ఆవేదన కలిగించే అంశమని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం నాలుగు ప్రధాన అంశాలపై దృష్టి సారించిందని మంత్రి వివరించారు. ప్రజల్లో అవగాహన కల్పించడం, రహదారుల నిర్మాణం, లోపాల సవరణ, నిబంధనల కఠినంగా అమలు చేయడం, ప్రమాదం జరిగిన వెంటనే వైద్యం అందించేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా 25 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు గల వారు అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, రాంగ్ రూట్ ప్రయాణం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని ఆయన హెచ్చరించారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించడం వల్ల ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. యువత వేగాన్ని నియంత్రించుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం ఆత్మహత్యతో సమానమని అన్నారు. ప్రజల్లో మార్పు వచ్చినప్పుడే పోలీసు, రవాణా శాఖల కృషి ఫలిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు స్టేడియం మైదానంలో పాఠశాల విద్యార్థులతో కలిసి మంత్రి 'హెల్మెట్ - సేవ్ లైవ్స్' ఆకారంలో భారీ మానవహారాన్ని నిర్వహించారు. విద్యార్థులు రహదారి భద్రతపై నినాదాలు చేస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు. అనంతరం యువతకు లెర్నింగ్ లైసెన్స్‌లను, డ్రైవర్లకు ఉచితంగా కళ్లద్దాలను మంత్రి పంపిణీ చేశారు. అనంతరం మంత్రి స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి అంబేద్కర్ చౌక్ వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని మంత్రి ప్రారంభించడమే కాకుండా, స్వయంగా పాల్గొని ఉత్సాహపరిచారు. అనంతరం అంబెడ్కర్ చౌక్ లో రవాణా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించినకార్యక్రమంలోమంత్రి పాల్గొని వాహన దారులకు హెల్మెట్లను పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్ రాజ్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ మల్లెపూల నర్సయ్య, జిల్లా ఇంచార్జి కలెక్టర్ యువరాజు మర్మాట్, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఆర్డీఓ స్రవంతి, రవాణా శాఖ డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ పి. రవీందర్ కుమార్, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ ఎస్. శ్రీనివాస్, అసిస్టెంట్ మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ కె. హరీంద్ర కుమార్, అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సోలార్ అంగన్వాడీల దిశగా అడుగులు వేయాలి : మెదక్ ఎంపీ

నర్సాపూర్ : సోలార్ అంగన్వాడీల దిశగా అడుగులు వేయాలని, ప్రతి అంగన్వాడి కేంద్రం వద్ద సోలార్ ప్లేట్లు అమర్చాలని ఎంపీ రఘునందన్ రావు సూచించారు. బుధవారం నర్సాపూర్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు తో పాటు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ సుహాసిని రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ లక్ష్మీ రాజు యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. యుద్ధం నీతి సూత్రాలను నేర్పించిందని, స్వయం ఉత్పత్తిపై దృష్టి సారించాలని సూచించారు.

ప్రతి అంగన్వాడీ కేంద్రంలో సోలార్ ప్లేట్లను అమర్చుకొని విద్యుత్ ను ఉత్పత్తి చేయాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించారు. ఆకుకూరలను కేవలం అంగన్వాడీ కేంద్రాలలోనే పెంచడం కాకుండా ప్రతి అంగన్వాడీ కార్యకర్త వారి ఇండ్లలో పెంచి ఆచరణలో పెట్టాలన్నారు. గౌతమ బుద్ధుడు చెప్పినట్లుగా బోధనలు చేయడం కాదు ఆచరణలో పెట్టాలి అనే విధంగా అంగన్వాడీ టీచర్లు ఆచరించాలన్నారు. పాతకాలపు ఆకుకూరలు మార్కెట్లలో అంతరించిపోయాయని, వాటిని పునరుద్ధరించాలని సూచించారు. సోలార్ విద్యుత్ తో ఇండక్షన్ స్టవ్ లను వాడడం మూలంగా గ్యాస్ సమస్య తీరుగుతుందన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ లక్ష్మీరాజు యాదవ్ కోరిక మేరకు నర్సాపూర్ పట్టణంలో మూడు అంగన్వాడీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ డిడబ్ల్యుఓ హేమ భార్గవి, మున్సిపల్ వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, కౌన్సిలర్లు, అంగన్వాడి సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు మరియు చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కమీషన్లకు కక్కుర్తిపడి..

# మా రైతుల కడుపులు కొడతారా..

### మా అనుమతి లేకుండా మా భూమి ఆక్రమిస్తున్నారు.. రాయికల్ రైతుల అవేదన



రాయికల్: ఏప్రిల్ 15 (తెలంగాణ వాణి): రాయికల్ పట్టణంలో గతం నుండి ట్యాంకుల నిర్మాణం పేరుతో దాదాపు 6కి పైగా వాటర్ ట్యాంకులు కలిగి ఉన్నాయని, అందులో ఒక మెగా వాటర్ట్యాంకులో ఇటీవల మండలానికి పూర్తిగా నీటి సరఫరా చేయగలిగిన సామర్థ్యం ఉందని రైతులు తెలిపారు. కాంట్రాక్టర్లకు కమీషన్ల కక్కుర్తికి పడి తమ భూములను బలవంతంగా లాక్కొని, అనవసరంగా వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ పంట పొలాల్లో గత ప్రభుత్వ హయాంలో మిషన్ భగీరథ పేరుతో మిగిలిపోయిన మున్సిపల్ నిధులను దుర్వినియోగం చేయాలని చూస్తున్నారని అయినా అవసరం లేని చోట మరో వాటర్ ట్యాంకును నిర్దేశించి, తమ అనుమతి లేకుండానే పట్టా భూములను లాక్కొని నిర్మాణం చేపట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. రాయికల్ పట్టణానికి చెందిన సర్వేనెంబర్లు 988/2/1/1, 988/2/1/2, 988/2/1/3 పరిసరాల్లోని రైతుల పంట పొలాలను కూడా లక్ష్యంగా చేసుకొని ప్రైవేటు నిర్మాణాలకు సర్కిల్ చేశారని తెలిపారు. ఈ అనవసర వాటర్ ట్యాంకు నిర్మాణం వల్ల 80 రైతు కుటుంబాలకు పంటకు నష్టం, మూడు రైతు కుటుంబాలు పూర్తిగా భూములను కోల్పోయి కనీస ఆదాయం లేక ఆకలిబాధలు పడే పరిస్థితి నెలకొందని వాపోయారు. దీనివల్ల సిమెంటు రోడ్లు, భారీ రోడ్లు, మురికి కాలువలు, వీధి కరెంటు పోల్స్‌కు కూడా ఇబ్బంది ఏర్పడుతుందని వివరించారు. తమ భూములను ఇవ్వమని చెప్పినను అభ్యంతరం లేకుండా లాక్కున్నారని, రైతు కుటుంబాలపై ఒత్తిడి వల్ల ఉద్యమం తప్పదని హెచ్చరించారు. ఇదంతా కాంట్రాక్టర్ల ధనార్జనే లక్ష్యంగా సాగుతోందని ఆరోపించారు. గ్రామానికి నిజంగా నీరందించాలనే సంకల్పం ఉంటే, పట్టణంలో ఉన్న 6 వాటర్ ట్యాంకులను, మెగా ట్యాంకును సక్రమంగా వాడుకోకుండా మళ్లీ తమ భూములనే టార్గెట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలం ఉండగా తమ కుటుంబాలనే ఇబ్బంది పెట్టడం సరికాదని, వెంటనే అధికారులు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని, పట్టా భూముల్లో కొత్త నిర్మాణాలు చేపట్టవద్దని రైతులు కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు కూర్మ మల్లారెడ్డి, కుర్మ నారాయణ రెడ్డి, కుర్మ ప్రేమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోవా యాత్రకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు..

కాప్రా: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో కుషాయిగూడ డిపో నుండి గోవా యాత్రకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ యాత్రలో గోవాతో పాటు గోకర్ణ, మురుడేశ్వర్, కుక్కే సుబ్రహ్మణ్యం, ఉడిపి, ధర్మస్థల వంటి క్షేత్రాల దర్శనం కూడా ఉంటుంది. మొత్తం ఐదు రోజులు పాటు ఉండే ఈ యాత్ర ఈ నెల 23వ తేదీన గురువారం ఉదయం 10 గంటలకు ఈసీఐఎల్ బస్సు టెర్మినల్ నుంచి బయలుదేరుతుందన్నారు. టికెట్ ధర రూ. 5వేలుగా నిర్ణయించారు. భోజన వసతి, ఇతర ఖర్చులు ప్రయాణికులు భరించుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ యాత్రకు వెళ్లాలనుకునే వారు బుకింగ్‌తో పాటు పూర్తి వివరాల కోసం 99592 26145, 96035 49388 నెంబర్లను సంప్రదించవచ్చు అని వెల్లడించారు.

# వేడిగాలులపై అప్రమత్తంగా ఉండాలి

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నిర్మల్, ఏప్రిల్:15(తెలంగాణ వాణి ప్రతినిధి): జిల్లా వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. సాధారణ స్థాయికి మించి 1.5డిగ్రీల నుండి 3.5డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నదని, జిల్లాలో వచ్చే వారం రోజుల పాటు వేడి గాలులు (హీట్‌వేవ్) ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. పట్టణాలు, గ్రామాలు, ట్రాఫిక్ కూడళ్ల వద్ద అవసరమైన ప్రదేశాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, రెడ్‌క్రాస్ వంటి సేవా సంస్థలను భాగస్వామ్యం చేయాలని సూచించారు. చలివేంద్రాల్లో ప్రజలకు తాగునీటితో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రజలు తగినంత నీరు తాగుతూ శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుకోవాలని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు, అనారోగ్యంతో ఉన్న వారు మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడాలని సూచించారు. జిల్లాలో హీట్‌వేవ్ యాక్షన్ ప్లాన్‌ను అత్యవసరంగా సిద్ధం చేసి అమలు చేయాలని, ప్రదేశాల వారీగా వాతావరణ పరిస్థితులను భారత వాతావరణ శాఖ వెబ్‌సైట్ ద్వారా నిరంతరం పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. అలాగే, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు అప్రమత్తంగా ఉండాలని, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, డీహైడ్రేషన్ చికిత్సకు అవసరమైన ఔషధాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ప్రజలు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## సురక్షిత ప్రయాణమే కుటుంబానికి భరోసా

### -వాహనదారులు రోడ్ భద్రత నియమాలు తూ.చ.తప్పకుండా పాటించాలి
### -జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్



ఏటూరునాగారం, ఏప్రిల్15(తెలంగాణ వాణి)సురక్షిత ప్రయాణమే కుటుంబానికి భరోసా ఇస్తుందని, వాహనదారులు తప్పనిసరిగా రోడ్ భద్రత నియమాలు పాటించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలుర గురుకుల పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన " అరైవ్ - అలైవ్ " కార్యక్రమానికి ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాలతో కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని ప్రతి ఒక్కరూ సురక్షితంగా ప్రయాణం చేసి కుటుంబానికి భరోసా కల్పించాలని పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా రోడ్ భద్రత నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దని సూచించారు.

# సంపత్ నంది సినిమాను లైన్‌లో పెట్టిన శర్వా..



'నారీ నారీ నడుమ మురారీ, బైకర్' చిత్రాలతో దూసుకుపోతున్న చార్మింగ్ స్టార్ శర్వానంద్, 'భోగి' చిత్రంతో హ్యాట్రిక్ కొట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పాన్-ఇండియా పీరియడ్ యాక్షన్ డ్రామా కోసం దర్శకుడు సంపత్ నందితో తొలిసారి శర్వానంద్ చేతులు కలిపారు. శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని లక్ష్మీ రాధామోహన్ సమర్పిస్తున్నారు. ఇది శర్వానంద్ కెరీర్‌లో అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టులలో ఒకటిగా రూపుదిద్దుకుంటోంది. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ సినిమాపై భారీగా అంచనాలను పెంచేసిన విషయం తెలిసిందే. 'బైకర్' మూవీ ప్రమోషన్స్ నిమిత్తం తీసుకున్న బ్రేక్ అనంతరం, శర్వానంద్ మళ్లీ ఈ సినిమా షూట్‌లో జాయిన్ అయినట్లుగా మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుతం ఈ చిత్రం రాజమండ్రిలో అత్యంత కీలకమైన, లెన్తీ షెడ్యూల్‌ను ప్రారంభించిందని, షూటింగ్ రంపచోడవరం అడవులలోని కఠినమైన, సవాలుతో కూడిన ప్రదేశాలలో జరగనుందని, ఇక్కడ ఎక్సయిటింగ్, టఫ్ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నట్లుగా మేకర్స్ ఈ అప్డేట్‌లో తెలిపారు. ఈ సన్నివేశాలను యాక్షన్ కొరియోగ్రాఫర్ ధిలీప్ సుబ్బరాయన్ పర్యవేక్షణలో చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో శర్వానంద్‌తో పాటు ప్రధాన తారాగణం మొత్తం పాల్గొంటున్నారని, ఇది సినిమా నిర్మాణానికి కీలక షెడ్యూల్ అని మేకర్స్ ప్రకటించారు. 'ఎ బ్లడ్ ఫెస్ట్' అనే ట్యాగ్‌లైన్‌తో రూపుదిద్దుకుంటోన్న ఈ చిత్రంలో శర్వానంద్ ఒక సరికొత్త అవతార్‌లో కనిపించనున్నారు. ఆ విషయం ఇప్పటికే వచ్చిన ఫస్ట్ లుక్ తెలియజేసింది. 1960లో ఉత్తర తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దు నేపథ్యంలో దర్శకుడు సంపత్ నంది ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వాస్తవికమైన కథనం, పవర్ ఫుల్ నేపథ్యంతో ఈ చిత్రం ఇంటెన్స్ డ్రామాతో గొప్ప ఎక్స్‌పీరియన్స్ ఇవ్వనుందని చిత్రబృందం చెబుతోంది. శర్వానంద్ సరసన అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. రక్షా బంధన్ స్పెషల్‌గా 28 ఆగస్ట్, 2026న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా థియేటర్లలో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# సినిమా



## విష్ణుప్రియకు కాసులు కురిపించిన వివాదం..

# ఫిర్యాదుతో అమాంతం పెరిగిన ఆదాయం!



డిజిటల్ మీడియా యుగంలో నెగెటివ్ పబ్లిసిటీ కూడా ఒక్కోసారి పాజిటివ్ ఫలితాలను ఇస్తుందనడానికి తాజా ఉదాహరణగా నిలుస్తున్నారు బుల్లితెర నటి, బిగ్‌బాస్ ఫేమ్ విష్ణుప్రియ భీమినేని. అశ్లీల కంటెంట్‌ను ప్రోత్సహిస్తున్నారంటూ ఆమెపై నమోదైన పోలీస్ కేసు, నైతికంగా ఆమెను ఇబ్బంది పెట్టాలనే లక్ష్యంతో చేసినప్పటికీ, ఆర్థికంగా మాత్రం ఊహించని రీతిలో కలిసొచ్చింది. ఈ వివాదం కారణంగా ఆమె నెలవారీ ఆదాయం ఏకంగా రూ.11 లక్షలకు పైగా పెరగడం ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. విష్ణుప్రియ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ప్రత్యేకమైన వీడియోల కోసం నెలకు రూ.399 చొప్పున సబ్‌స్క్రిప్షన్ ఫీజు వసూలు చేస్తున్నారు. ఆమెపై విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు అందకముందు, ఆమెకు 1,892 మంది సబ్‌స్క్రైబర్లు ఉండేవారు. దీని ద్వారా ఆమెకు నెలకు సుమారు రూ.7.18 లక్షల ఆదాయం వచ్చేది. అయితే, ఎప్పుడైతే ఆమెపై ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్ఎఫ్) నేతలు ఫిర్యాదు చేశారో, ఈ వార్త మీడియాలో ప్రముఖంగా ప్రసారమైంది. దీంతో ఆమె అప్‌లోడ్ చేసే కంటెంట్‌లో ఏముందో చూడాలనే ఆసక్తి నెటిజన్లలో ఒక్కసారిగా పెరిగింది. ఫలితంగా, కొద్ది రోజుల్లోనే ఆమె సబ్‌స్క్రైబర్ల సంఖ్య 4,832కు చేరింది. తద్వారా ఆమె నెలవారీ ఆదాయం ఇప్పుడు రూ.18.36 లక్షలకు పైగా చేరింది. అంటే, కేవలం ఈ వివాదం వల్ల ఆమె సంపాదనలో రూ.11 లక్షలకు పైగా పెరుగుదల కనిపించింది. శనివారం విజయవాడ సూర్యారావుపేటలోని సైబర్ క్రైమ్ పోలీసులకు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. సాయికుమార్ ఫిర్యాదు చేశారు. విష్ణుప్రియ డబ్బుల కోసం యువతను తప్పుదోవ పట్టించేలా అర్ధనగ్న వీడియోలు పోస్ట్ చేస్తున్నారని, ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తక్షణమే బ్లాక్ చేయాలని డిమాండ్ చేశారు.

సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన సెలబ్రిటీలు ఇలాంటి పనులు చేయడం సరికాదని వారు విమర్శించారు. అయితే, నైతిక విలువలను కాపాడాలనే ఉద్దేశంతో చేసిన ఈ ఫిర్యాదు, పరోక్షంగా విష్ణుప్రియకు ఉచిత ప్రచారంగా మారింది. ఒక విషయాన్ని ఎంతగా అడ్డుకోవాలని ప్రయత్నిస్తే, దానిపై జనంలో అంతగా ఆసక్తి పెరుగుతుందనే 'స్ట్రీసాండ్ ఎఫెక్ట్' ఇక్కడ స్పష్టంగా పనిచేసింది. మొత్తంగా ఈ సంఘటన, విమర్శలే పెట్టుబడిగా మారి నెగెటివ్ పబ్లిసిటీ కూడా సానుకూల ఫలితాలను ఇవ్వగలదని నిరూపించింది.

# 'పాపం ప్రతాప్'కు వినూత్న ప్రచారం.. మంచు లక్ష్మి వీడియోతో పెరిగిన హైప్




వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న తిరువీర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం పాపం ప్రతాప్ విడుదలకు సిద్ధమైంది. 'మసూద', 'పరేషాన్', 'ది గ్రేట్ ప్రీ వెడ్డింగ్' వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేకమైన శైలిని ఏర్పరచుకున్న తిరువీర్, ఈసారి వినోదాత్మక కథతో ప్రేక్షకులను అలరించడానికి వస్తున్నారు. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ నిర్మాణంలో రాకేష్ రెడ్డి గడ్డం, రుద్రదేవ్ మాదిరెడ్డి సంయుక్తంగా నిర్మిస్తుండగా, దర్శకుడు ఎస్. పి. దుర్గ నరేష్ తెరకెక్కిస్తున్నారు. ఏప్రిల్ 17న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందం ప్రచార కార్యక్రమాలను మరింత వేగవంతం చేసింది. సినిమా ప్రచారంలో భాగంగా విడుదల చేసిన ఒక ప్రత్యేక వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. ఒకప్పుడు ప్రసిద్ధి చెందిన బతుకు జట్కా బండి తరహాలో 'బతుకు జట్కా పంచాయతీ విత్ మంచు అక్క' అనే కాన్సెప్ట్‌తో ఈ వీడియోను రూపొందించారు. ఈ వీడియోలో మంచు లక్ష్మి 'మంచు అక్క' పాత్రలో కనిపిస్తూ, ప్రతాప్ సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తుంది. కథ ప్రకారం పెళ్లైన నాలుగు రోజుల్లోనే భార్య వదిలి వెళ్లిపోవడంతో బాధలో ఉన్న ప్రతాప్, మంచు లక్ష్మిని ఆశ్రయిస్తాడు. ఈ క్రమంలో ఆమె తనదైన శైలిలో ప్రశ్నలు అడుగుతూ, అతడిని నిలదీయడం నవ్వులు పంచుతోంది. తిరువీర్ అమాయకంగా ఇచ్చే సమాధానాలు, మంచు లక్ష్మి మేనరిజమ్స్, డైలాగ్‌లతో వీడియో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా చివర్లో అజయ్ ఘోష్ ఎంట్రీ ఇచ్చి సన్నివేశాన్ని మరింత హాస్యంగా మలచడం హైలైట్‌గా మారింది. ఆయన జోక్యం చేసుకోవడానికి ప్రయత్నించగా, మంచు లక్ష్మి ఇచ్చిన కౌంటర్ ప్రేక్షకులను బాగా అలరిస్తోంది. ఇటీవల విడుదలైన పాపం ప్రతాప్ ట్రైలర్‌కు ప్రేక్షకుల నుండి మంచి స్పందన లభిస్తోంది. 1998 కాలం నాటి గోదావరి ప్రాంతాన్ని సహజంగా చూపించిన విజువల్స్, సరదా సంభాషణలు సినిమాపై అంచనాలను పెంచాయి. టైటిల్‌కు తగ్గట్టే ఒక సాధారణ యువకుడు తన జీవితంలో ఎదురయ్యే విచిత్ర పరిస్థితుల వల్ల 'పాపం ప్రతాప్'గా ఎలా మారాడనేది కథగా తెలుస్తోంది. హాస్యంతో పాటు భావోద్వేగాలను కలిపిన కథ ఈ చిత్రంలో ఉంటుందని చిత్ర బృందం చెబుతోంది. ఈ చిత్రంలో పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా నటిస్తుండగా, అజయ్ ఘోష్, రాశి, రఘుబాబు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. వీరి అనుభవం సినిమాకు మరింత బలం చేకూర్చనుంది.

## కుమార్తెల పెళ్లిపై రాజశేఖర్ వ్యాఖ్యలు..

# సంబంధాలు వస్తున్నా, ఎందుకు ఆగామంటే..!



టాలీవుడ్ సీనియర్ నటుడు రాజశేఖర్ తాజాగా తన కుటుంబం, రాజకీయాలు, తాజా సినిమా గురించి చేసిన వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. హీరో శర్వానంద్ నటించిన బైకర్ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. తన కుమార్తెలు శివాని రాజశేఖర్, శివాత్మిక రాజశేఖర్ పెళ్లి గురించి మాట్లాడుతూ రాజశేఖర్ స్పష్టత ఇచ్చారు. మా అమ్మాయిలకు పెళ్లి సంబంధాలు వస్తున్నాయి. కానీ వాళ్లు మాత్రం ఇంకొంత కాలం సినిమాల్లో నటించాలనుకుంటున్నారు. వారి అభిరుచికి మేము ప్రాధాన్యత ఇస్తున్నాం. అందుకే ప్రస్తుతం పెళ్లి ప్రయత్నాలను ముందుకు తీసుకెళ్లడం లేదు అని తెలిపారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కుమార్తెల నిర్ణయానికి తల్లిదండ్రుల మద్దతు ఉండటం పట్ల అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు. రాజకీయాల గురించి మాట్లాడుతూ, తాము రాజకీయాల్లోకి వచ్చినప్పుడు ఎవరిపైనా ఆధారపడలేదని, సొంత డబ్బుతోనే ముందుకు వెళ్లామని చెప్పారు. అలాగే తన భార్య జీవిత రాజశేఖర్‌కి రాజకీయాలంటే ఆసక్తి లేదని వెల్లడించారు. ఇక తమిళ హీరో విజయ్ రాజకీయ ప్రవేశంపై స్పందిస్తూ, ఆయన రాజకీయాల్లోకి రావడం మంచి పరిణామమని పేర్కొన్నారు. రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలులో విజయ్ విజయం సాధించే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. చాలా కాలం తర్వాత రాజశేఖర్, బైకర్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. ఈ చిత్రానికి అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహించగా, యూవీ క్రియేషన్స్ నిర్మించింది. ఈ సినిమాలో రాజశేఖర్, శర్వానంద్‌కు తండ్రి పాత్రలో నటించగా, హీరోయిన్‌గా మాళవిక మోహనన్ కనిపించారు. భారతీయ సినీ చరిత్రలోనే తొలి పూర్తి స్థాయి 'మోటో క్రాస్ డ్రామా'గా రూపొందిన ఈ సినిమా ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. సినిమాకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన రావడంతో పాటు, రాజశేఖర్ నటనకు ప్రత్యేక ప్రశంసలు దక్కుతున్నాయి.

## వరుణ్ తేజ్‌కు గాయం .. సర్జరీ విజయవంతం, 'బరి' షూటింగ్‌కు బ్రేక్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తాజాగా ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చేరడం అభిమానులను ఆందోళనకు గురి చేస్తుంది. ప్రస్తుతం ఆయన హీరోగా తెరకెక్కుతున్న 'బరి' సినిమా కోసం ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందుతున్న ఈ చిత్రాన్ని యువ దర్శకుడు యదు వంశీ తెరకెక్కిస్తున్నారు. సమాచారం ప్రకారం, మంగళవారం ఫుట్‌బాల్ ప్రాక్టీస్ చేస్తుండగా వరుణ్ తేజ్ కాలికి తీవ్ర గాయం అయింది. వెంటనే చిత్ర యూనిట్ అప్రమత్తమై ఆయనను అపోలో ఆసుపత్రికి తరలించింది. అక్కడ వైద్యులు పరీక్షించి చిన్నపాటి శస్త్రచికిత్స చేయాల్సిన అవసరం ఉందని సూచించగా, వెంటనే ఆపరేషన్ నిర్వహించారు. ఈ శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైనట్లు వైద్యులు తెలిపారు. ప్రస్తుతం వరుణ్ తేజ్ ఆసుపత్రిలోనే విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన ఆరోగ్యం స్థిరంగా ఉందని, అయితే పూర్తిగా కోలుకోవడానికి కొన్ని వారాల పాటు పూర్తి విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించారు. దీంతో 'బరి' సినిమా షూటింగ్ షెడ్యూల్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఆయన కోలుకున్న తర్వాతే తిరిగి షూటింగ్ ప్రారంభం కానుంది. ఇక ఈ సినిమా 2027 సంక్రాంతి సందర్భంగా విడుదలకు సిద్ధమవుతుండగా, అభిమానుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. యాక్షన్‌తో కూడిన హై-వోల్టేజ్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో వరుణ్ తేజ్ కొత్త లుక్‌లో కనిపించనున్నారని తెలుస్తోంది. వరుణ్ తేజ్ గాయంపై సమాచారం బయటకు రావడంతో సోషల్ మీడియాలో మెగా అభిమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "గెట్ వెల్ సూన్" అంటూ పోస్టులు చేస్తూ, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు. మెగా ఫ్యాన్స్ మాత్రమే కాకుండా, సినీ ప్రముఖులు కూడా ఆయన ఆరోగ్యం గురించి తెలుసుకుంటూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఇలాంటి అనూహ్య ఘటనతో షూటింగ్‌కు తాత్కాలిక విరామం వచ్చినప్పటికీ, చిత్ర బృందం మాత్రం వరుణ్ పూర్తిగా కోలుకున్న తర్వాత మరింత జోష్‌తో సినిమా పనులు తిరిగి ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంది.



## అర్హతలేని డిప్లొమాతో..

# ఏడీఈ ఉద్యోగ బాధ్యతలేమిటి?

**శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలో మరో సంచలనం**

**లంచాలతో పదోన్నతులు పొందినట్టు ఆరోపణలు**

**భార్య కంపెనీ పేరుతో అవకతవకలు**

**విజిలెన్స్ దర్యాప్తుకు " వైఎఫ్ డిఆర్" సంస్థ డిమాండ్**

కొత్తగూడెం/ శ్రీశైలం (తెలంగాణ వాణి) శ్రీశైలం జలవిద్యుత్ కేంద్రంలోని మెకానికల్ విభాగంలో పనిచేస్తున్న ఏడీఈ పి . జంగిల్ పాషా (అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్) పై పెద్ద ఎత్తున ఆరోపణలు వెల్లువెతుతున్నాయి. సంబంధిత అధికారి అర్హతలేని డిప్లొమా సర్టిఫికేట్ ఆధారంగా పదోన్నతులు పొందినట్లు సహచర ఉద్యోగులు ఆరోపిస్తున్నారు విశ్వసనీయంగా అందిన సమాచారం ప్రకారం, సంబంధిత అధికారి 2000 సంవత్సరంలో ఐటీఐ అర్హతతో జేపీఏగా ఉద్యోగంలో చేరాడని తెలుస్తోంది. అనంతరం డిప్లొమా సర్టిఫికేట్ ఉంటే సబ్ ఇంజనీర్‌గా ప్రమోషన్ పొందవచ్చని తెలుసుకుని, ముంబైలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ఇంజనీర్స్ (ఇండియా) ద్వారా డిప్లొమా సర్టిఫికేట్ పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. అయితే ఆ సర్టిఫికేట్ ఏపీఎస్ఈబీ సర్వీస్ రెగ్యులేషన్స్ ప్రకారం అవసరమైన డిప్లొమా అర్హతకు సమానమైంది కాదని తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (సబీటెట్) నిబంధనల ప్రకారం డిప్లొమా సమానత ఇవ్వాలంటే కనీసం 60 నుండి 80శాతం సిలబస్ కవరేజ్ ఉండాలన్న నిబంధనలు ఉన్నట్లు తెలుస్తోంది. కానీ నిపుణుల కమిటీ నివేదిక ప్రకారం, సంబంధిత కోర్సులో కేవలం 40 శాతం మాత్రమే సిలబస్ ఉన్నట్లు తేలింది. దీంతో ముంబైలోని ఆ ఇన్స్టిట్యూట్ ఇచ్చిన డిప్లొమా సర్టిఫికేట్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు పొందిన డిప్లొమాకు సమానంగా పరిగణించలేమని సదరు కమిటీ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది? అంతే కాక భారత ప్రభుత్వ మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ సెకండరీ, హయ్యర్ ఎడ్యుకేషన్ విభాగం 2022లో జారీ చేసిన నోటిఫికేషన్ ద్వారా ఇటువంటి అర్హతలను రద్దు చేసినట్లు కూడా సమాచారం. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారి డిప్లొమా ఏపీ ఎస్‌బీటీఈటీ డిప్లొమాకు సమానంగా కాదని స్పష్టమవుతోంది. అయినప్పటికీ, ఏపీఎస్ఈబీ సర్వీస్ రెగ్యులేషన్స్ ప్రకారం అర్హత లేకపోయినా, పై అధికారులకు ముడుపులు చెల్లించుకుని పదోన్నతులు పొందినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దశల వారీగా ప్రమోషన్లు పొందుతూ ప్రస్తుతం ఏడీఈ స్థాయికి చేరినట్లు తెలుస్తోంది. ఆర్టీఐ ద్వారా జంగిల్ పాషా కు సంబంధించిన టెక్నికల్ సర్టిఫికెట్స్ కోరినప్పుడు పై అధికారులు ఇవ్వకుండా లంచాలు ఇచ్చి జంగిల్ పాషా ఆపుతున్నట్లు వైఎఫ్డీఆర్ కు తెలిపింది. తన పనికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం లేకపోయినా ఇలాంటి వ్యక్తిని ఉన్నత స్థానంలో ఎలా నియమించారనే ప్రశ్నలు తోటి అధికారులు లేవనెత్తుతున్నారు. మరోవైపు, తన భార్య పేరుతో ఒక కంపెనీ ఏర్పాటు చేసి కంపెనీ కార్యాలయ పనులను శ్రీశైలం ప్రాజెక్టు లోనే చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆ కంపెనీకి వచ్చే ఆదాయాన్ని అధికారికంగా చూపకుండా మోసం చేస్తున్నాడని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ లాభాలలో కొంత తన పైఅధికారులకు కూడా ఇస్తున్నట్లు పక్కా సమాచారం. అదనంగా, కొంతమంది ఆర్టిజన్లను వ్యక్తిగత పనులకు ఉపయోగిస్తున్నాడని తోటి ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన బాల పర్వతాలు ఎస్సీ మాల సామాజిక వర్గానికి చెందిన ఒక ఫస్ట్ గ్రేడ్ ఫోర్మెన్‌ను మానసికంగా వేధించడంతో, అతను మూడు ఇన్‌క్రిమెంట్లు కోల్పోయినట్లు సహచరులు పేర్కొంటున్నారు. ఈ మొత్తం వ్యవహారంపై విజిలెన్స్, డిపార్ట్మెంటల్ ఎంక్వైరీ నిర్వహించాలని, సంబంధిత అధికారి అర్హతలేని డిప్లొమాను రద్దు చేయాలని, పదోన్నతులను రద్దు చేసి తిరిగి పూర్వపు పదవికి పంపించాలని సర్వత్ర వ్యాఖ్యలు, ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతేగాక ఇప్పటివరకు పొందిన వేతనాలను రికవరీ చేయాలని, తప్పుడు పత్రాలు సమర్పించినందుకు సస్పెండ్ చేయాలని ఉద్యోగ సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. వైఎఫ్డీఆర్ ప్రెసిడెంట్ పి బేబీ పూర్తి ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

## ఓపెన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు**



నిర్మల్, ఏప్రిల్:15(తెలంగాణ వాణి ప్రతినిధి): జిల్లాలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా స్థానిక సంస్థల ప్రధాన కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. ఓపెన్ పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణపై అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు బుధవారం, తన ఛాంబర్ లో సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 20వ తేదీ నుంచి 27 వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్న 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు రెండు పూటలా పరీక్షలు నిర్వహించాలన్నారు. జిల్లాలో 1035 మంది పదవ తరగతి, 821 ఇంటర్, మొత్తం కలిపి 1856 మంది విద్యార్థులు, 5 ఎస్ ఎస్ సి, 4 ఇంటర్, మొత్తం 9 పరీక్ష కేంద్రాలలో ఓపెన్ పరీక్షలు రాయనున్నట్లు వివరించారు. అన్ని పరీక్ష కేంద్రాలలో విద్యార్థులు సౌకర్యవంతంగా పరీక్షలు రాసేలా తగిన ఫర్నిచర్, తాగునీరు, నిరంతరాయ విద్యుత్ సరఫరా, తదితర వసతులు ఉండాలన్నారు. తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య సిబ్బందితో కూడిన అత్యవసర వైద్య శిబిరం ఏర్పాటు చేసి అవసరమైన అత్యవసర మందులు, ఓఆర్ఎస్ పొట్లాలు అందుబాటులో ఉంచాలన్నారు. దూర ప్రాంత విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా అవసరమైకు ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. ఈ సమావేశంలో డిఈఓ భోజన్న, డిఐఈఓ పరుశురాం, తపాలా శాఖ ఇన్స్పెక్టర్, ఎసిజిఈ పరమేశ్వర్, ఆర్టీసీ, వైద్య శాఖల అధికారులు రమేష్, సౌమ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## 'అరైవ్ అలైవ్' వారోత్సవాల్లో..

## భాగంగా భారీ మానవహారం

**రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంపు**

**జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్**



నిర్మల్, ఏప్రిల్:15(తెలంగాణ వాణి ప్రతినిధి): ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న 'అరైవ్ అలైవ్' వారోత్సవాలు జిల్లాలో విజయవంతంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఉదయం నిర్మల్ పట్టణంలోని జయశంకర్ చౌరస్తా సమీపంలో విద్యార్థులచే భారీ మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో కళాజాత బృందాలు తమ పాటల ద్వారా ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో చైతన్యం కల్పించాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థి దశ నుంచే ట్రాఫిక్ నియమాలపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని తెలిపారు. జిల్లాలోని పాఠశాలల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలపై క్విజ్, వ్యాసరచన పోటీలు కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులే రోడ్డు భద్రతకు బ్రాండ్ అంబాసిడర్లు అని, పిల్లలు చెప్పే మంచి విషయాలను ప్రతి ఒక్కరూ గౌరవంగా స్వీకరిస్తారని అన్నారు. కుటుంబ సభ్యులు వాహనాల్లో ప్రయాణించే సమయంలో హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ధరించడం, మద్యం సేవించి వాహనం నడపకూడదనే అంశాలు, అతివేగం ప్రమాదాలు వంటి విషయాలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమం ముగింపులో కలెక్టర్, అధికారులు, విద్యార్థులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సీపీఓ జీవరత్నం, డీఈవో భోజన్న, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఎంవిఐ మహేందర్, వివిధ పాఠశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పెన్షనర్ల సంక్షేమానికి..

# సంపూర్ణ సహకారం

**విహారయాత్రకు 15 లక్షలు అందించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**





పటాన్ చెరు (తెలంగాణ వాణి రిపోర్టర్) పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ రిటైర్డ్ పెన్షనర్ల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. రామచంద్రపురం ప్రభుత్వ పెన్షనర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన కాశీ, అయోధ్య, ఢిల్లీ, హరిద్వార్, విహార యాత్రను బుధవారం ఉదయం ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విహార యాత్ర కోసం 15 లక్షల రూపాయల సొంత నిధులను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంతో అనుభవం కలిగిన తెలిసిన పెన్షనర్లు నియోజకవర్గ అభివృద్ధికి సలహాలు సూచనలు అందించాలని కోరారు. గత దశాబ్ద కాలంగా పెన్షనర్ల సంక్షేమానికి కృషి చేయడంతో పాటు, వారికి సొంత భవనం సైతం నిర్మించి ఇవ్వడం జరిగిందని తెలిపారు. వారి కష్టసుఖాల్లో అండగా ఉంటున్నామని తెలిపారు. తమ సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్ కు పెన్షనర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, పరమేష్ యాదవ్, ఐలేష్, ప్రమోద్ గౌడ్, పెన్షనర్ల సంఘం ప్రతినిధులు రామిరెడ్డి, రాములు, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాలు

**ఫైర్ స్టేషన్‌ను సందర్శించిన ఆల్ఫోర్స్ విద్యార్థులు**



భైంసా (తెలంగాణ వాణి ప్రతినిధి) అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా భైంసా పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాల విద్యార్థులు స్థానిక అగ్నిమాపక కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ రవికుమార్ విద్యార్థులకు అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనుకోని పరిస్థితుల్లో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఆందోళన చెందకుండా వెంటనే ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, సమీపంలోని సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సూచించారు. అలాగే అగ్ని వ్యాప్తిని తగ్గించేందుకు తీసుకోవాల్సిన ప్రాథమిక చర్యలను అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ స్టేషన్‌లో ఉపయోగించే అగ్నిమాపక పరికరాల గురించి వివరించి, వాటి వినియోగాన్ని విద్యార్థులకు ప్రదర్శించారు. విద్యార్థులు ఆసక్తిగా పరికరాలను పరిశీలిస్తూ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## రాజన్న సిరిసిల్ల జిల్లా పోతిరెడ్డిపల్లెలో చిరుత కలకలం..

రాజన్న సిరిసిల్ల జిల్లా :రాజన్న సిరిసిల్ల జిల్లా పోతిరెడ్డిపల్లె గ్రామంలో చిరుత సంచారం కలకలం రేపింది. గ్రామాని చెందిన సద్దుల పూర్ణ ఇంటి వద్ద కట్టేసిన లేగ దూడను చంపి తినేయడం స్థానికులను భయాందోళనలకు గురి చేసింది. ఉదయం లేచి చూసిన కుటుంబసభ్యులు దూడ మృతదేహాన్ని చూసి షాకయ్యారు. ఈ ఘటనతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గ్రామ పరిసరాల్లో చిరుత తిరుగుతుండటంతో గ్రామస్తులు తీవ్ర భాయందోళనలకు గురవుతున్నారు. వెంటనే చిరుతను పట్టుకోవాలని అటవీ సిబ్బందిని కోరుతున్నారు.



# ప్రయాణ సమయంలో రోడ్డు నియమాలు పాటించాలి

**రహదారి నియమాలు పాటించేలా తల్లిదండ్రులకు, సూచనలు ఇవ్వాలని,విద్యార్థులను కోరిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ**





సూర్యాపేట బ్యూరో (తెలంగాణ వాణి): ప్రయాణ సమయంలో తల్లితండ్రులు రోడ్డు నియమాలు పాటించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తల్లితండ్రులకు సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ, కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట పట్టణ సూర్యాపేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమం 3వ రోజు సూర్యాపేట పట్టణం లో గల సిటీ టాలెంట్ హై స్కూల్ నందు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ హాజరయ్యారు. రహదారి వినియోగంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన నియమాల గురించి పట్టణ సిఐ వెంకటయ్య, సూర్యాపేట ఎసిపి ప్రసన్న కుమార్, రవాణా శాఖ అధికారి జయప్రకాష్ రెడ్డి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలు తెలిపే కరపత్రాలు పోస్టర్లను అందించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని కోరారు. రోడ్లపై ప్రయాణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, రోడ్లపై నిర్లక్ష్యం జీవితాన్ని నాశనం చేస్తుందన్నారు. డ్రగ్స్ వినియోగం లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఎవరైనా తప్పుడు మార్గాలు సూచించిన తప్పుడు పనులకు ప్రోత్సహించిన వాటిని ఉపాధ్యాయుల దృష్టికి తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. తల్లిదండ్రులతో పాటు వాహనాలపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించాలి, సీట్ బెల్ట్ పెట్టుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రోడ్లపై తల్లిదండ్రులు ఆజాగ్రత్తగా ఉండడం వల్ల చాలా మంది పిల్లలు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారని తెలిపారు. రోడ్డు నియమాల గురించి రోడ్లపై పాటించాల్సిన జాగ్రత్తల గురించి విద్యార్థులు ఇంట్లో తల్లిదండ్రులకు తెలియజేయాలని హెల్మెట్ వాడడం సిట్ బెల్ట్ ధరించడం గురించి వివరించాలని అన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపకూడదు అనే విషయం గురించి తల్లిదండ్రులకు లేఖల ద్వారా తెలియజేయాలని సూచించారు. ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరిస్తామని సీట్ బెల్ట్ పెట్టుకుంటామని మద్యం తాగి వాహనాలు నడపమని తల్లిదండ్రుల నుండి పిల్లలు ప్రామిస్ తీసుకోవాలని పిలుపునిచ్చారు. పిల్లలపై తల్లిదండ్రులు ఎన్నో కలలు ఆశలు పెట్టుకుంటారని వీటిని నిజం చేయాల్సిన బాధ్యత పిల్లలపై ఉన్నదని అన్నారు. నిర్లక్ష్యంగా ఉంటే రహదారులపై ప్రమాదాల సంభవించి మృత్యువాత పడతారని గుర్తు చేశారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే టప్పుడు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలని సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. అనంతరం రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించి కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, కార్యక్రమానికి హాజరైన మీడియా ప్రతినిధులకు హెల్మెట్స్ పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమం నందు ఎసిపి ప్రసన్నకుమార్, ఇన్స్పెక్టర్ వెంకటయ్య, ఎమ్మార్వో కృష్ణయ్య, ఆర్టీవో జయప్రకాశ్ రెడ్డి, విద్యా సంస్థల యాజమాన్యం కరెస్పాండెంట్ ప్రకాష్, ప్రిన్సిపాల్ మురళీదర్ పోలీస్, ఆర్టీవో అధికారులు, సిబ్బంది ఉన్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar
MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com